


www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శనివారం | 18-1-2025 | పేజీలు: 10 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 15 |

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: పంచమి పూర్తి; నక్షత్రం: పుబ్బ మ. 2.51 తదుపరి ఉత్తర; వర్జ్యం: రా. 10.50-12.37; దుర్ముహూర్తం: ఉ. 6.52-8.21; అమృతఘడియలు: ఉ. 7.53-9.37; రాహుకాలం: ఉ. 9.30-10.30; సూర్యోదయం:6.52; సూర్యాస్తమయం: 5.58 | కర్నూలు


Kurnool | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



29వ వర్ధంతి
నా పరిపూర్ణ, పరిశుద్ధ హృదయంతో..
నిను కొల్చు భాగ్యం ఇంకెప్పుడూ..
ప్రభూ... ఈ జన్మకూ...
BOMMARILLU
ఆయన వీరాభిమాని
"బొమ్మరిల్లు వారి" సంస్థ అధినేత
వై.వి.ఎస్. చౌదరి


SITHARA ENTERTAINMENTS
SRIKARA STUDIOS
FORTUNE FOUR CINEMAS
KING OF SANKRANTI
A BOBBY KOLLI FILM
డాకు మహారాజ్
SURYADEVARA NAGA VAMSI SAI SOUJANYA
A THAMAN S MUSICAL
ADITYA MUSIC


MAHAAKAAL PICTURES
TRAILER OUT NOW
IN CINEMAS FROM
24th JAN
హత్య
DIRECTOR SRIVIDYA BASAWA PRODUCER S PRASHANTH REDDY
D.O.P ABHIRAJ NAIR MUSIC DIRECTOR NARESH KUMARAN P EDITOR ANIL KUMAR P
COLORIST K VISHNUVARDHAN SFX SYNC CINEMA MIXING ENGG ARAVIND MENON
ART DIRECTOR S PRASHANTH REDDY EP S SRIKANTH REDDY PUBLICITY DESIGN ARKO


GOKULAM GOPALAN
SREE GOKULAM MOVIES
RAGAM MOVIES
MOVIE MAXX
SREENIWAAS MANDALA
SVM
SRI VEDAKSHARA MOVIES
CHINTHAPALLI RAMARAO
TOVINO THOMAS
IDENTITY
తెలుగులో
2025 లో విడుదలైన తొలి మలయాళ సూపర్ హిట్
చిత్రం 40 కోట్లు వసూలు చేసి తెలుగులో యాక్షన్
థ్రిల్లర్ మూవీగా విడుదలవుతోంది.
WRITTEN & DIRECTED BY
AKHIL PAUL - ANAS KHAN
RAJU MALLIATH DR ROY C J
24TH JAN 2025


SMT. ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
GLOBAL STAR
RAM CHARAN
ZEE STUDIOS
DIL RAJU PRODUCTION
SANKRANTI BLOCKBUSTER
SHANKAR'S
GAME CHANGER
PRODUCED BY RAJU - SHIRISH
A THAMAN S MUSICAL
TELUGU - TAMIL - HINDI - KANNADA - MALAYALAM
NOW IN CINEMAS


DIL RAJU PRESENTS
SRI VENKATESWARA CREATIONS
BLOCKBUSTER PONGALUU
సంక్రాంతికి వస్తున్నాం
AN ANIL RAVIPUDI FILM
PRODUCER SHIRISH

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 18-1-2025
Kurnool | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | కర్నూలు

మూడో శనివారం స్వచ్ఛ దివస్

కర్నూలు కలెక్టరేట్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్వచ్ఛ దివస్, హౌసింగ్, రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్, ఉపాధి హామీ తదితర అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎన్జీవోలు, పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొనేలా ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


మాట్లాడుతున్న కలెక్టర్

ఎమ్మిగనూరులో రైతు జాతర


2

శివ నామం.. మోక్ష దాయకం..!


2

వలస బండి పయనం


3

పారిశ్రామికంగా మరో అడుగు...!



కర్నూలు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఓర్వకల్లు పారిశ్రామిక అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఐసీడీసీ)-స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ)కు ఏపీఐఐసీ నుంచి 2,621.15 ఎకరాలు బదిలీ చేసేందుకు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఇస్తూ శుక్రవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో వివిధ పరిశ్రమలు ఏర్పాటుకు మరో అడుగు ముందుకు పడినట్లయింది. అలాగే.. దేశంలోనే ప్రప్రథమ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ పార్క్ - ఓర్వకల్లు మొబిలిటీ వ్యాలీ స్థాపనకు పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ముందుకు వచ్చింది. రూ.1,800 కోట్ల పెట్టుబడులతో అభివృద్ధి చేసే ఓర్వకల్లు మొబిలిటీ వ్యాలీ కోసం రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ సమక్షంలో పీపుల్ టెక్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఓర్వకల్లు కేంద్రంగా పారిశ్రామిక పురోగతికి వేగంగా అడుగులు పడుతున్నాయి.

14 వేల కోట్లతో ఓర్వకల్లులో సెమి కండక్టర్ పరిశ్రమ

ఇటీవలే రూ.14 వేల కోట్లతో దేశంలోనే ప్రప్రథమంగా ఓర్వకల్లులో సెమి కండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధిత కంపెనీ ప్రతినిధులతో ఒప్పందం చేసుకున్నాం. తాజాగా దేశంలోనే తొలి ప్రైవేట్ ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) పార్క్-ఓర్వకల్లు మొబిలిటీ వ్యాలీ ఏర్పాటుకు పీపుల్ టెక్ గ్రూప్ ముందుకు రావడం అభినందనీయం. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రైవేట్ ఈవీ పార్క్‌ను ఓర్వకల్లు కేంద్రంగా ఏర్పాటు చేద్దామని అడుగానే ఒప్పుకోవడం అభినందనీయం అన్నారు. ఎలక్ట్రిక్ వెహికల్ విప్లవంలో ఓర్వకల్లు మొబిలిటీ వ్యాలీ అగ్రస్థానంలో నిలుస్తుంది.

- టీజీ భరత్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి



స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు

ఓర్వకల్లు పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని జూలై 23న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్-2024-25 సందర్భంగా లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించించిన సంగతి తెలిసిందే. ఆ తరువాత నెల రోజులకే నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసీడీపీ)లో భాగంగా దేశంలో 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఫేజ్-1 కింద రూ.2.786 కోట్లతో 2,612 ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా అభివృద్ధికి డిజైన్ చేశారు. రోడ్లు, నీరు, రవాణా, విద్యుత్.. వంటి మౌలిక సౌకర్యాలు కల్పిస్తే.. నాన్ మెటలిక్ మినరల్ పరిశ్రమలు, ఆటోమొబైల్ రంగం విడిభాగాల తయరీ, పునరుత్పాదక పరిశ్రమలు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ పరికరాలు, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ హార్డ్‌వేర్, ఫార్మాస్యూటికల్స్, వజ్రాలు, బంగారు అభరణాల తయారీ, వస్త్ర ఉత్పత్తి రంగ పరిశ్రమలు ఇక్కడే ఏర్పాటు చేసేందుకు నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) ప్రత్యేక దృష్టిని పెట్టింది. ఆయా పరిశ్రమలు ఏర్పాటు ద్వారా రూ.12 వేల కోట్లు పెట్టుబడులు వస్తాయని, తద్వారా 45,071 మంది యువతకు ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేశారు. ఇప్పటికే అవసరమైన భూములను కేటాయిస్తూ మంత్రిమండలి ఆమోదం తెలిపింది. తాజాగా ఓర్వకల్లు మండలం మీదివేముల, ఉప్పలపాడు, ఎన్. కొంతలపాడు గ్రామాల్లో ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఐసీడీసీ)-స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ)కు 2,621.15 ఎకరాలు బదిలీ చేసేందుకు ఏపీఐఐసీకు అవసరమైన సేల్ డీడ్ ఎగ్జిక్యూషన్ కోసం ఇండియన్ స్టాంప్ యాక్ట్ -1899, సెక్షన్ 9(1)(ఏ) కింద స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చట్టం-1908 సెక్షన్ 78 కింద రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఇస్తూ సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఏపీఐసీడీసీకి ఏపీఐఐసీ భూములు బదిలీ చేయగానే కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.2.786 కోట్లతో మౌలిక వసతుల పనులకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. అదే జరిగితే స్థానికులు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి.

- ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్‌కు 2,621.15 ఎకరాలు
- ఏపీఐఐసీకి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు
- రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- పరిశ్రమల ఏర్పాటుకు వేగంగా అడుగులు
- ఓర్వకల్లు కేంద్రంగా ప్రైవేట్ ఎలక్ట్రిక్ వాహన పార్క్ ఏర్పాటు


మంత్రులు టీజీ భరత్, నారా లోకేశ్ సమక్షంలో పరిశ్రమల ఏర్పాటుపై ఎంఓయూ

ఓర్వకల్లు కేంద్రంగా దేశంలో ప్రథమ ఎలక్ట్రిక్ వాహన పార్క్

ఓర్వకల్లు కేంద్రంగా భారతదేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ ఎలక్ట్రిక్ వాహన పార్క్-ఓర్వకల్లు మొబిలిటీ వ్యాలీ ఏర్పాటు చేయడానికి పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ముందుకు వచ్చింది. శుక్రవారం రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ సమక్షంలో పీపుల్ టెక్ గ్రూప్ సీఈవో టీజీ విశ్వప్రసాద్, ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ) సీఈవో సాయికాంత్‌వర్మ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఆ పత్రాలను మార్చుకున్నారు. ఈ సంస్థ ఓర్వకల్లు కేంద్రంగా 1,200 ఎకరాల్లో ఎలక్ట్రిక్ వాహన పార్క్-ఓర్వకల్లు మొబిలిటీ వ్యాలీ స్థాపించనుంది. ఇది దేశంలోనే ప్రప్రథమ ప్రాజెక్టు అని తెలిపారు. ఈ వ్యాలీ రూ.1,800 కోట్లతో అభివృద్ధి చేస్తారు. రూ.13 వేల కోట్లు పెట్టుబడులు రాబట్టడంతో పాటు 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యం. ఇందులో యాంకర్ యూనిట్‌గా పీపుల్ టెక్ గ్రూప్ రూ.300 కోట్ల పెట్టుబడితో ఎలక్ట్రిక్ టూ వీలర్ (ఈ2డబ్ల్యూ) తయారీ యూనిట్‌ను స్థాపిస్తారు. ఆర్ అండ్ డి సెంటర్లు, టెస్టింగ్ ట్రాక్‌లు, ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ స్పేసెస్, పరిశ్రమల ఏర్పాటుకు ప్లాట్లు సహా హౌసింగ్, ఆస్పత్రులు, విద్యా సంస్థలు, మాల్స్ వంటి సామాజిక మౌలిక సదుపాయాలు కూడా కల్పించనున్నారు. పీపుల్ టెక్ గ్రూప్ సీఈవో టీజీ విశ్వప్రసాద్, ఆ సంస్థ ప్రతినిధి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఓర్వకల్లు మొబిలిటీ వ్యాలీ-ప్రైవేట్ ఎలక్ట్రిక్ వాహన పార్క్ దేశంలోనే అత్యున్నత స్థాయిలో నిలుస్తుందని అన్నారు.

రక్తమోడిన రహదారి

- ఐచర్ లారీ, కారు ఢీ
- ముగ్గురి దుర్మరణం
- బస్సును ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రమాదం
- కోడుమూరులో విషాదం


నుజ్జు అయిన కారు

వివరాలు 3లో..

విజయ డెయిరీ వద్ద ఉద్రిక్తత

- నంద్యాలలో భూమా వర్గీయుల ఆందోళన
- ఆగిన ఎన్నికల నామినేషన్ ప్రక్రియ

నంద్యాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల విజయ డెయిరీ డైరెక్టర్ పదవుల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ శుక్రవారం ఉద్రిక్తతకు దారి తీసింది. నామినేషన్ ప్రక్రియ సక్రమంగా జరగడం లేదంటూ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వర్గీయులు ఆందోళనకు దిగడంతో తాత్కాలికంగా వాయిదా వేశారు. దీనిపై వైసీపీ నాయకులు స్పందించారు. అధికార బలం ఉందని నామినేషన్ ప్రక్రియను టీడీపీ నాయకులు వాయిదా వేయించారని ఆరోపించారు.

ఉదయం నుంచే హైటెన్షన్

పాణ్యం నియోజకవర్గం నెరవాడ సొసైటీ అధ్యక్షురాలు సరళమ్మ, ఆళ్లగడ్డ నియోజకవర్గం గంగవరం అధ్యక్షులు ఉడత రమణ, బనగానపల్లి నియోజకవర్గం గిద్దలూరు సొసైటీ అధ్యక్షులు కామిరెడ్డి చెన్నారెడ్డిలకు చెందిన పదవీ కాలం మూడు వారాల కిందట ముగిసింది. దీంతో ఈ మూడు స్థానాలకు శుక్రవారం నామినేషన్ స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు. అయితే డైరెక్టర్ పదవులను అక్రమంగా పాలకవర్గం రద్దు చేసిందని భావించి ఇదివరకే భూమి జగత్ విఖ్యాత్‌రెడ్డి హైకోర్టుకు వెళ్లారు. ఈ క్రమంలోనే భూమా వర్గీయులు, పలువురు టీడీపీ నాయకులు, పాల రైతులు ఉదయాన్ని డెయిరీ వద్దకు చేరుకున్నారు. కొందరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చారు. అయితే నామినేషన్ ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని భూమా వర్గీయులు ఆందోళనకు దిగారు. చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేయడంతో పాటు డెయిరీ లోపలకు వెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో వారికి పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీయడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు.

మిగతా 2వ పేజీలో


ఆందోళన చేస్తున్న భూమా వర్గీయులు, టీడీపీ నాయకులు, పాల రైతులు..

క్వింటం కందులు రూ.8,000

ఆదోని అగ్రికల్చర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం కందులు క్వింటం గరిష్ఠంగా రూ.8 వేలు పలికాయి. ఈ ఏడాది కంది సాగు గణనీయంగా పెరిగింది. ఈ నెల 11న శనివారం రూ.6,529 ప్రకారం అమ్ముడుపోయాయి. వారంరోజుల్లో క్వింటానికి రూ.1500 పైగా ధర పెరగడంతో కంది రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 40 క్వింటాళ్ల కంది విక్రయానికి రైతులు తీసుకొని రాగా వాటి కనిష్ఠ ధర రూ.5,509, గరిష్ఠ ధర రూ.8వేలు, మధ్యస్థ ధర రూ.6,211 పలికింది.



సీమలో పారిశ్రామిక విప్లవం
రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

3

జలవనరుల శాఖ ఎస్ఈగా ద్వారకనాథ్‌రెడ్డి

శివనామం.. మోక్షదాయకం..!





ఆత్మకూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివ దీక్షను ఆచరించేందుకు మల్లన్న భక్తులు సిద్ధమవుతున్నారు. శివదీక్షతో మోక్ష ప్రాప్తి, మానసిక ప్రశాంతత లభిస్తుందన్న సంకల్పంతో తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది శివభక్తులు దీక్షను స్వీకరిస్తున్నారు. నియమ నిష్టలతో దీక్షను పూర్తి చేసి ఈ ఏడాది ఫిబ్రవరి 26న జరిగే మహా శివరాత్రి నాటికి స్వామివారికి ఇరుముడి సమర్పించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేప థ్యంలోనే జిల్లాలో ప్రస్తుతం శివస్వాములు మం డల దీక్షను పూనుకుంటుండటంతో ఆయా ప్రాం తాల్లోని శివాలయాలు శివనామస్మరణతో మార్మో గుతున్నాయి. శివస్వాములు ఆచరించే మండల దీక్ష మానవ జీవన చక్రంపై ఆధారపడి ఉండేలా 48 రోజులుగా తొలుత ప్రారంభించారు. అంటే జీవన చక్రంలోని 9 గ్రహాలు, 12 రాశులు, 27 నక్షత్రాలు మొత్తం 48 రోజులుగా పరిగణలోకి తీసుకుని మండల దీక్షను పూర్తి చేసేవారు. అయి తే కాలక్రమంలో మండల దీక్ష 41 రోజులు, అర్ధమండల దీక్ష 21 రోజులతో పాటు 11రోజులతో కూడిన శివ దీక్షనే శివభక్తులు ఆచరిస్తున్నారు. కొందరు కార్తీక మాసం నుంచే దీక్షను ఆరంభించి 108 రోజుల పాటు పరమశివున్ని ఆరాధిస్తారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు శివ దీక్షను స్వీకరిస్తున్నారు.

1994 నుంచి శ్రీశైలం మల్లన్న దీక్షలు ఆరంభం

ప్రాచీన గ్రంధాల్లో ఉన్న శివదీక్ష ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని 1994లో శ్రీశైలంలో అప్పటి ఈవో వంగాల శంకరరెడ్డి తొలిసారిగా ఆరంభించారు. అప్పట్లో ఆయన వివిధ ప్రాంతాలకు చెందిన పలువురి బ్రాహ్మణులతో చర్చించి శివదీక్ష ప్రాశస్త్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి వారిలో ఆధ్యాత్మిక బావాలను పెంపొందించేందుకు సంకల్పించారు. తొలుత ఆయా ప్రాంతాల్లో పదుల సంఖ్యలో శివభక్తులు దీక్షను స్వీకరించగా ప్రస్తుతం లక్షలాది మంది భక్తులు మల్లన్నను స్మరిస్తూ శివదీక్షను పూనుకుంటున్నారు. ఈ ఏడాది మహాశివరాత్రి నాటికి తెలుగు రాష్ట్రాల నుంచి శ్రీశైలానికి లక్షలాది మంది శివస్వాములు రానున్నట్లు దేవస్థానం అధికారులు అంచనా వేశారు. కాగా ఇరుముడి సమర్పించేందుకు వచ్చే శివదీక్ష పరులకు శ్రీశైల దేవస్థానం వారు కొన్ని వెసులుబాట్లు కల్పిస్తున్నారు. ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసి మహాశివరాత్రి బ్రహోత్సవాల్లో కొద్దిరోజుల పాటు ఉచిత స్పర్శ దర్శనాన్ని కల్పిస్తారు. అలాగే ఇరుముడి సమర్పించేందుకు శిబిరాలను ఏర్పాటు సిద్ధం చేస్తారు.




శివదీక్షను స్వీకరించిన నల్లమల చెంచులు

- జీవన చక్రంతో ముడిపడిన మండల దీక్ష
- మొదలైన శివదీక్ష మాలధారణ
- తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది స్వీకరించే అవకాశం

పురాణాల్లో శివ దీక్షకు ప్రాధాన్యత

ఇతిహాస పురాణాల్లో శివదీక్ష ప్రాధాన్యంత ఉన్నట్లు విక్రమాదిత్యుని తామ్ర శాసనం ద్వారా తెలుస్తోంది. శివదీక్షను చేపట్టిన వారిలో మొట్టమొదటి భక్తురాలు పార్వతీదేవిలో ఇందులో చెప్పబడింది. జగన్మాత పార్వతీదేవి కఠోరమైన శివదీక్ష చేపట్టి పరమశివుడి అనుగ్రహం వల్లే అర్ధాంగి అయినది. శివుని శరీరమందు అర్ధ భాగం స్వీకరించడంతో పరమేశ్వరుడు అర్ధనారీశ్వరుడుగా మారాడు. కాగా బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, శ్రీరామచంద్రుడు, శ్రీకృష్ణుడు, అర్జునుడు, భక్తకన్నప్ప, పర్వతుడు, భక్తసిరియాలుడు వారు కూడా శివదీక్షను పాటించినట్లు విక్రమాధితున్ని గ్రంధంలో పేర్కొనబడింది. కార్తీకేయుడు కూడా శివదీక్షను పూని దేవతాసిన్యాలకు అధిపతి అయ్యాడు. ఇంతటి దివ్యమహిమ గల శివదీక్ష ఎంతో ప్రాచీనమైందిగా చెప్పవచ్చు.



చెంచులకు శివదీక్షధారణ దుస్తులు, సామగ్రిని అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

శివదీక్ష చివర్లో ఇరుముడి ధారణ



శివదీక్ష ధరించిన శివస్వాములు దీక్ష చివరి నాటికి ఇరుముడి ధారణతో శివుడి సన్నిధికి చేరుకుంటారు. గోధుమ వర్ణం సంచిలో స్వామిఅమ్మవారికి నివేదించేందుకు పూజాసరంజామతో పాటు నైవేద్యం తీసుకెళ్లడమే ఇరుముడి ధారణ. ఇందులో స్వామివారికి ఆవు నెయ్యి, తేనె, కుంకుమ, గంధము, విభూది, బిల్వం, అగరుబత్తులు, మూడు కొబ్బరికాయలు, కర్పూరంతో పాటు బియ్యం, 11 రూపాయల దక్షిణను మంత్రోచ్చారణతో గురుస్వామి చేతుల మీదుగా ఇరుముడిలో వేసుకొని తలపైకి ఎత్తించుకొని శివ సన్నిధికి చేరుకుంటారు. స్వామి వారికి ఇరుముడి సమర్పించిన తర్వాత మహా శివరాత్రి రోజు అర్ధరాత్రి లింగోద్భవం అనంతరం శివదీక్షను విరమించాల్సి ఉంటుంది.

శ్రీశైలం ఈవో చొరవతో 1994లోనే శివదీక్ష స్వీకరించాను



1994లో శ్రీశైలంలో ప్రారంభించిన శివదీక్షల్లో భాగంగా శ్రీశైలం దేవస్థానం ఈవో వంగాల శంకరరెడ్డి చొరవతో శివదీక్షను తొలిసారిగా స్వీకరించాను. అప్పట్లో ఆత్మకూరు పట్టణం నుంచి 25 మంది దాగా శివ దీక్షను స్వీకరించి పాదయాత్రగా శ్రీశైలానికి వెళ్లి మల్లన్నకు ఇరుముడి సమర్పించాం. మొదటిసారిగా శివదీక్షను స్వీకరించిన శివస్వాములకు దేవస్థానం వారు సకల సదుపాయాలు కల్పించారు. అప్పటి నుంచి ఏటేటా శివస్వాముల సంఖ్య పెరగడంతో నేడు లక్షల సంఖ్యలో శివభక్తులు శివదీక్షను ఆచరిస్తున్నారు. శివదీక్షతో మోక్షప్రాప్తి కల్గుతుందన్నది మా అందరి విశ్వాసం.

– గరుడాద్రి సత్యనారాయణశర్మ, పురోహితుడు, ఆత్మకూరు



శ్రీశైల క్షేత్రం

శివస్వాములకు ఏలోటు రానివ్వం



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి వచ్చే శివదీక్షా పరులకు ఏలోటు రానివ్వకుండా దేవస్థానం తరుపున అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తాం. మహా శివరాత్రి బ్రహోత్సవాల్లో శివస్వాములకు ప్రత్యేక క్యూలైన్ల ద్వారా ఉచిత స్పర్శ దర్శనం కల్పించే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకోవడం జరుగుతోంది. ఇరుముడి సమర్పించేందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి అక్కడే హోమ గుండాలు, తాగునీరు, భోజన సదుపాయాలతోపాటు మరుగుదొడ్లను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటాం. అలాగే ఇరుముడి సమర్పణకు అర్చకులను నియమిస్తాం. కాలినడకన తరలివచ్చే శివస్వాములకు మరిన్ని సదుపాయాలు కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

– శ్రీనివాసరావు, శ్రీశైలం దేవస్థానం ఈవో

ఎన్టీఆర్‌కు అక్షర నివాళి



నంద్యాల కల్చరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు పెయింటింగ్‌తో నివాళులర్పించారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ఏ3 డ్రాయింగ్ షీట్‌పై మైక్రో పెన్‌తో ఎలాంటి గీతలు లేకుండా 2,600 అక్షరాలతో చిత్రాన్ని వేశారు. 'ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి' అనే నినాదంతో ఈ చిత్రాన్ని గీసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ... విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు అనేక పౌరాణిక, జానపద, సాంఘిత చిత్రాలలో వైవిధ్యమైన పాత్రలెన్నో పోషించి మెప్పించడమే కాకుండా రాముడు, కృష్ణుడు మంటి పౌరాణిక పాత్రలతో తెలుగు వారి హృదయాల్లో శాశ్వతంగా ఆరాధ్యదైవంగా నిలిచిపోయారన్నారు. మహానుభావులు, కారణజన్ములు అన్ని అర్హతలు ఉన్న ఎన్టీఆర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇచ్చి సముచిత గౌరవం కల్పించాలని డిమాండ్ చేశారు.



ఎన్టీఆర్ చిత్రాన్ని గీస్తున్న చిత్రకారుడు కోటేష్

విజయ డెయిరీ వద్ద ఉద్రిక్తత



డెయిరీ వద్ద తోపులాట



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి తమ వైసీపీ నాయకులు, కార్యకర్తలతో డెయిరీ వద్దకు వస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఇరువర్గాలు వస్తే లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తే అవకాశం ఉందని భావించారు. వెంటనే డెయిరీ ఎన్నికల అధికారితోపాటు ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తాత్కాలిక వాయిదా వేస్తున్నామని ఎండీ ప్రదీప్‌కుమార్ మీడియాకు వివరించారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

నిరాశతో వెనక్కివెళ్లిన అభ్యర్థులు...

నామినేషన్ ప్రక్రియ వాయిదా వేయడంతో అభ్యర్థులు నిరాశతో వెనక్కి వెళ్లారు. అయితే కొందరు మాత్రం ఉదయం 10 గంటలకు వచ్చారు. వారిలో బనగానపల్లెకు చెందిన గిరిదేవి, పాణ్యంకు చెందిన మాజీ డైరెక్టర్ సరళమ్మ, బండిఆత్మకూరు మండలానికి చెందిన చౌడేశ్వరి, బేతంచెర్ల మండలానికి చెందిన ఆచారిలు డైరెక్టర్ స్థానాలకు నామినేషన్ వేయడానికి వచ్చారు. అయితే వీరిలో కొందరికి బలపరిచే అభ్యర్థులు లేకపోవడం గమనార్హం.

అధికారంతో వాయిదా వేయించారు..

అధికారాన్ని అడ్డుగా పెట్టుకొని విజయ డెయిరీకి చెందిన ఎన్నికల నామినేషన్ ప్రక్రియను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వాయిదా వేయించారని నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. డెయిరీకి సమీపంలోని ఓ హోటల్‌లో వారు మాట్లాడారు. పాల ఉత్పత్తిదారులు కాకుండా టీడీపీ నాయకులు అడ్డుకోవడం దారుణమని వారి దౌర్జాన్యానికి నిదర్శమని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులను కోరారు. అధికారం కలకాలం ఉండదనే విషయాన్నే టీడీపీ నాయకులు గ్రహించాలని గుర్తు చేశారు.

లా అండ్ ఆర్డర్ సమస్యతో వాయిదా వేశాం..



మూడు డైరెక్టర్ స్థానాలకు నామినేషన్ దాఖలు పక్రియ చేపట్టాం. అయితే పోలీసుల లా అండ్ ఆర్డర్ సమస్య ఉందని మా దృష్టికి తెచ్చారు. దీంతో తాత్కా లికంగా ఎన్నికల నామినేషన్ పక్రియను వాయిదా వేశాం. ఎప్పుడు నిర్వహించేది తర్వాత చెబుతాం. నిబంధనలకు లోబడే ఎన్నిక ప్రక్రియ ఉంటుంది.

-డెయిరీ ఎండీ ప్రదీప్ కుమార్

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష శనివారం జరుగుతుందని, విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 6వ తరగతిలో 80 సీట్లకుగాను మొత్తం 6035 విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. 18వ తేదీ శనివారం ఉదయం 11.30 గంటల నుంచి 1.30 గంటల వరకు ఈ పరీక్ష జరుగుతుందన్నారు. కర్నూలు జిల్లాలోని ఆలూరులో-2, ఆదోనిలో 2, ఎమ్మిగనూరులో 3, పత్తికొండలో 2, కోడుమూరులో 1, కర్నూలులో -3 మొత్తం 13 కేంద్రాలు, నంద్యాల జిల్లాలో డోన్-1, నందికొట్కూరు-1, నంద్యాలలో 2, ఆత్మకూరులో 1, బనగానపల్లెలో 2, కోవెలకుంట్లలో 1, ఆళ్లగడ్డలో 1 మొత్తం 9 మొత్తం 22 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ నెంబర్, పాస్‌వర్డ్‌గా పుట్టిన తేదీని ఉపయోగించి ఆన్‌లైన్ ద్వారా అడ్మిట్ కార్డును పొందాలన్నారు. రిజిస్ట్రేషన్ నెంబర్ మరచిపోయిన అభ్యర్థులు బనవాసి జవహర్ నవోదయ విద్యాలయ హెల్ప్‌-లైన్ నంబర్ సహకారంతో రిజిస్ట్రేషన్ నెంబర్‌ను తెలుసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే 085212-29454, 9652350633, 9985738899లలో సంప్రదించాలన్నారు.

నేడు సాహితీ స్రవంతి కార్యాలయం ప్రారంభం

కర్నూలు (కల్చరల్), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు తెలకపల్లి నరసింహయ్య 6వ వర్ధంతి సందర్భంగా ఆయన నివాసాన్ని సాహితీ స్రవంతి ప్రాంతీయ కార్యాలయంగా శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభిస్తున్నామని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆవుల బసప్ప, ఆవుల చక్రపాణి యాదవ్ తెలిపారు. నగరంలోని కృష్ణానగర్‌లో ఈ కార్యాలయం ప్రారంభోత్సవంతో పాటు ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి సేకరించిన 108 ఏళ్ల నాటి కర్నూలు నవల 'చతురిక' ఆవిష్కరణ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యాలయాన్ని గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర ప్రారంభిస్తారని, నవల ఆవిష్కరణ సభకు అధ్యక్షుడిగా సాహితి స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ వ్యవహరిస్తారన్నారు. ముఖ్య అతిథిగా ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి, వక్తలుగా లలితా కళా సమితి అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ప్రముఖ నవలా రచయిత ఎస్‌వీ అజీజ్ పాల్గొంటారన్నారు.

రైతు జాతర..

- రూ.లక్షల్లో పలుకుతున్న వృషభాలు
- వివిధ ప్రాంతాల నుంచి విక్రయానికి వచ్చిన ఎద్దులు

జాతరలో విక్రయానికి వచ్చిన వృషభాలు





ఎమ్మిగనూరు , జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు జాతర అంటేనే ఒక ప్రత్యేకత ఉంది. ఈ జాతరలో రైతులు మొదలుకొని చిన్న పిల్లల వరకు వారికి అవసరమయ్యే వస్తు సామగ్రి లభిస్తుంది. దీంతో ఈ జాతరకు తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి జనాలు ఈ జాతరకు తరలి వస్తారు. ప్రధానంగా రైతులకు అవసరమయ్యే చర్నాకోలు (చెలకోల) మొదలు కొని వృషభాలు, వ్యవసాయ పనిముట్లు లభిస్తాయి. దీంతో రైతులు ఈ జాతర వచ్చిందంటే వృషభాలను కొనుగోలు చేసేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తారు. ఎమ్మిగనూరు చుట్టుముట్టు గ్రామాల నుంచి గాక తెలంగాణ, కర్ణాటక నుంచి పశుపోషకులు తమ వృషభాలను విక్రయానికి తీసుకురావడంతో మంత్రాలయం రోడ్డులోని శ్రీనివాస నగర్‌లో ఏర్పాటు చేసిన సంత సందడిగా మారింది. ఇందులో దేశవాళి వృషభాలు రూ.70 వేల నుంచి రూ.3.50 లక్షల వరకు ధర పలకడం విశేషం.

అందుబాటులో వ్యవసాయ పనిముట్లు..

రైతులకు వ్యవసాయంలో అవసరమయ్యే వివిధ రకాల వ్యవసాయ పనిముట్లు సైతం జాతరలో వ్యాపారులు రైతులకు అందుబాటులో పెట్టారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల రోడ్డులోని మాచాని సోమప్ప మెమోరియల్ హాల్ ముందు ఎద్దుల బండ్లు, బండి చక్రాలు, కాడిమాన్లు, నాగళ్లు, గుంటికలు, గొర్రులు, బండి నాగళ్ల, దంతెలు విక్రయానికి ఉంచారు. వీటిని రైతులు కొనుగోలు చేస్తూ కనిపించారు.

చెక్కపాయె.. ఇనుము వచ్చే..

ఎన్నో ఏళ్లుగా రైతులకు అవసరమయ్యే వివిధ రకాల పనిముట్లు చెక్కతోనే తయారు చేసిన వాటిని వినియోగిస్తూ వస్తున్నారు. అయితే గత కొన్ని సంవత్సరాల నుంచి చెక్క స్థానంలో ఇనుముతో తయారు చేసిన వ్యవసాయ పనిముట్లు పుష్కలంగా తయారు చేసి విక్రయిస్తున్నారు. ఎమ్మిగనూరులో జాతరలో గతంలో చెక్క వ్యవసాయ సామగ్రి కనిపించేది. అయితే ప్రస్తుతం వాటి స్థానంలో ఇనుముతో తయారు చేసిన ఎద్దుల బండ్లు, గొర్రులు, బండి చక్రాలు, దంతెలు, నాగళ్ల కనిపిస్తున్నాయి. రైతులు సైతం ఎక్కువ రోజులు మన్నిక వస్తాయన్న ఆశతో వీటిని కొనుగోలు చేస్తున్నారు. గోనెగండ్ల మండలం హెచ్‌కైరవాడి, పుట్టపాశం, తెలంగాణలోని సింగారంతోపాటు ఆయా ప్రాంతాలకు చెందిన వ్యాపారులు తమ ఇళ్ల దగ్గరే ఇనుముతో వ్యవసాయ పనిముట్లు తయారు చేసి విక్రయానికి తెచ్చారు. దాదాపు 15-20 రోజుల వరకు వీటిని ఉంచి విక్రయిస్తారు. ఒక ఎద్దుల బండి రూ.42 వేల వరకు పలుకుతోంది. ఇనుముతో తయారు చేసిన ఎద్దుల బండ్లకు టైర్ల చక్రాలను అమర్చి విక్రయిస్తున్నారు.



వలస బండి



- 600 కుటుంబాలు వలసబాట
- 60 వాహనాల్లో తెలంగాణ, కర్ణాటక, గుంటూరుకు పయనం

కోసిగి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ పూర్తి చేసుకున్న ఉద్యోగులు పట్టణాలకు తిరుగుముఖం పడుతుంటే.. పల్లె వాసులు మాత్రం వలస బండి ఎక్కుతున్నారు. కర్నూలు జిల్లాకు పశ్చిమాన పల్లెలు సంక్రాంతి పండుగను చూసుకుని సుదూర ప్రాంతాలకు వలసవెళ్తున్నారు. తాజాగా కోసిగి మండలంలో శుక్రవారం ఒక్కరోజే సుమారు 60 వాహనాల్లో వివిధ గ్రామాల నుంచి 600కు పైగా కుటుంబాలు వివిధ ప్రాంతాలకు వలసబాట పట్టారు. ప్రతి ఏడాది డిసెంబరు నుంచి జనవరి, ఫిబ్రవరి నెలల్లో స్థానికంగా పనులు లేకపోవడంతో ఈ ప్రాంతంలో వలసలు సర్వసాధారణం. తల్లిదండ్రులతో పాటు చదువుకునే పిల్లలు సైతం వలసవెళ్తున్నారు.

కోసిగితో పాటు అగసనూరు, జుమాలదిన్నె, కామన్‌దొడ్డి, చింతకుంట, బోంపల్లి, డి.బెళగల్, కోల్‌మాన్‌పేట, ఆర్లబండ, వందగల్లు, చిర్తనకల్, మూగలదొడ్డి, సాతనూరు, జంపాపురం, సజ్జలగుడ్డం తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కూలీలు ప్రత్యేక వాహనాల్లో తెలంగాణ, కర్ణాటక, గుంటూరు తదితర ప్రాంతాలకు వెళ్లారు. స్థానికంగా పనులు లేకపోవడమే ప్రధాన కారణమని కూలీలు చెబుతున్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో మిరప, పత్తి తీసేందుకు పనులకు వెళ్తున్నామని కూలీలు తెలిపారు.



కోసిగి మండలం కామన్‌దొడ్డి గ్రామం నుంచి గుంటూరుకు బయల్దేరిన ప్రజలు

ప్రతి ఏటా తప్పడం లేదు

ఇప్పటి నుంచి పదేళ్ల నుంచి వలసలు వెళ్తానే ఉన్నాం. ఆరు నెలలు మాత్రమే మాకు పనులు దొరుకుతాయి. మిగతా ఆరు నెలలు వేరే ఊర్లకు తమ పిల్లలను వెంట పెట్టుకుని గుంటూరు, ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాము. ఏ ప్రభుత్వం ఉన్నా మమ్మల్ని ఆదుకోరు. మా జీవితంలో ఎలాంటి మార్పు లేదు.

- లక్ష్మి, కామన్‌దొడ్డి గ్రామం



బైక్‌లు ఢీ.. వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్ కృష్ణాపురం వద్ద శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆళ్లగడ్డ రూరల్ ఎస్‌ఐ హరి ప్రసాద్ వివరాల మేరకు.. ఆళ్లగడ్డ మండలం క్రిష్ణంపల్లెకు చెందిన రైతు నాగరాజు వేరుశనగ విత్తనాలు కొనుగోలు చేసేందుకు రామకృష్ణాపురం బయలుదేరాడు. ఆళ్లగడ్డ మండలం కొండంపల్లెకు చెందిన మణికంఠ అనే యువకుడు తన ద్విచక్ర వాహనంపై చాగలమర్రి వైపు వెళ్తున్నాడు. వీరిద్దరి వాహనాలు ఆర్ కృష్ణాపురం వద్ద వేగంగా ఢీకొనడంతో నాగరాజు(51) అక్కడికక్కడే మృతి చెందాడు. మణికంఠకు తీవ్ర గాయాలు కావడతో నంద్యాల ఆసుపత్రికి తీసుకెళ్లారు. నాగరాజు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి కుమారుడు నాగేంద్ర ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద మృతి

ఆదోని రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆదోని-ఎమ్మిగనూరు బైపాస్‌లోని నాగలాపురం సమీప పంట పొలాల్లో ఓ వ్యక్తి చెట్టుకు వేలాడుతూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. వివరాలివీ.. ఆదోని పట్టణం మండిగిరిలో నివాసం బోయ శివ(36) నివాసం ఉంటు న్నారు. 13 సంవత్సరాల క్రితం గోనెగండ్ల మండలం పెద్దమర్రి వీడుకు చెందిన పార్వతితో వివాహమైంది. వీరికి పిల్లలు కాలేదు. శివ బేల్దార్ పని చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాకు వలస వెళ్లిన శివ దంపతులు వారం క్రితం ఆదోనికి వచ్చారు. శివ గురు వారం ఎమ్మిగనూరులో జరిగిన రథోత్సవా నికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. అయితే శుక్రవారం ఉదయం నాగలాపురం గ్రామ సమీపం వద్ద పంట పొలంలో ఉన్న వేప చెట్టుకు వేలాడుతూ కనిపించారు. తాలుకా ఎస్‌ఐ రామాంజనేయులు సిబ్బందితో అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. శివ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్ ఆధారంగా విచారణ చేపట్టాలని పోలీసులను కోరారు. శివ భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



శివ (ఫైల్)

ఆళ్లగడ్డ డీఎస్పీగా ప్రమోద్

ఆదోనికి మర్రిపాటి హేమలత

నంద్యాల/కర్నూలు క్రైం, జనవరి 17 (ఆంధ్ర జ్యోతి) : నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ డీఎస్పీగా కొల్కిపూడి ప్రమోద్‌ను నియమిస్తూ శుక్రవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న 25 మంది నూతన డీఎస్పీలకు పోస్టింగ్ ఇచ్చారు. 2023వ బ్యాచ్‌కు చెందిన కొల్కిపూడి ప్రమోద్ ఆళ్లగడ్డకు కేటాయించారు. అదేవిధంగా కర్నూలు జిల్లా ఆదోని డీఎస్పీగా మర్రిపాటి హేమలతను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆళ్లగడ్డ, ఆదోనిలో పనిచేస్తున్న డీఎస్పీలను రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని డీజీపీ ద్వారక తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు.

రక్తమోడిన రహదారి

- ఐచర్, కారు ఢీ ముగ్గురి దుర్మరణం
- బస్సును ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రమాదం
- కోడుమూరులో విషాదం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



ప్రమాదానికి కారణమైన వాహనం



మృతులు మాదుగుండు సోమశేఖర్, బండా శ్రీనివాసులు రాజోలు శ్రీనివాసులు (ఫైల్)



ఆసుపత్రి వద్ద బంధువులు

కోడుమూరు రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఘోరం జరిగింది. పది నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన వారి పట్ల విధి చిన్నచూపు చూసింది. ప్రమాద రూపంలో ముగ్గురిని బలి తీసుకుంది. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. వివరాలు ఇలా.. కోడుమూరులోని కొండపేటకు చెందిన టీడీపీ నాయకుడు, 16వ వార్డు మెంబర్ మాదుగుండు సోమశేఖర్(56) మాస్టర్ వీవర్. మగ్గంలో తయారైన చీరలను గద్వాల, హైదరాబాదు ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తుంటాడు. శుక్రవారం ఉదయం వరుసకు అల్లుడైన సాయ శ్రీనివాసులు (36), మరో వ్యక్తి బండా శ్రీనివాసులు (47)తో కలిసి కర్నూలుకు బ్యాంకు పని నిమిత్తం కారులో వెళ్లారు. అక్కడ బ్యాంకులో పని ముగించుకుని మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. అయితే ప్యాలకుర్తి విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో బస్సును దాటే క్రమంలో ఎదురుగా వస్తున్న ఐచర్ లారీని కారు వేగంగా ఢీకొంది. ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. లారీ రోడ్డు పక్కకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టి ఆగింది. లారీ టైరు పేలింది. ఈ ఘటనలో కారులో ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయపడి సీటు నుంచి కదల్లేని స్థితిలో పడిపోయారు. అటుగా వెళ్తున్న వాహనదారులు స్పందించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. కారు ముందు భాగం, డోర్లను బలవంతంగా వెనక్కు లాగి క్షతగాత్రులను బయటకు తీశారు. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న బండా శ్రీనివాసులు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తీవ్రంగా గాయపడిన మాదుగుండు సోమశేఖర్, సాయ శ్రీనివాసులును కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందారు. మరో పది నిముషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన వారు విగతజీవులుగా మారడం ఆ కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఘటనాస్థలిని సీఐ తబ్రేజ్, ఎస్‌ఐ శ్రీనివాసులు పరిశీలించారు.

మిన్నంటిన రోదనలు..

పట్టణ వాసులు పెద్దఎత్తున ఆసుపత్రికి చేరుకున్నారు. మృతదేహాలను చూసి మృతుల భార్యాపిల్లలు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సోమశేఖర్‌కు భార్య జయలక్ష్మి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కూతుళ్లు మురళీప్రియ బీటెక్, గీత ఇంటర్ చదువుతున్నారు. సాయ శ్రీనివాసులుకు భార్య రాణి, కొడుకు మణికంఠ, కూతుళ్లు చరిత, భార్గవి ఉన్నారు. ముగ్గురు కూడా ఐదేళ్లలోపు చిన్నపిల్లలే. బండా శ్రీనివాసులుకు భార్య శ్రీలత, ఇద్దరు కొడుకులు ఉన్నారు. వీరిలో ఉదయ్ ఇంటర్, తనయ్ 7వ తరగతి చదువుతున్నారు. టీడీపీ యువ నేత కోట్ల రాఘవేంద్రారెడ్డి, కుడా మాజీచైర్మన్ కోట్ల హర్షవర్ధనొరెడ్డి, జడ్పీటీసీ రఘునాథరెడ్డి బాధితులను పరామర్శించారు.

హడలెత్తిస్తున్న ప్రమాదాలు

ఇటీవల జరుగుతున్న వరుస ప్రమాదాలు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ఈ నెల 2న ప్యాలకుర్తి-కొత్తూరు గ్రామాల మధ్య బైక్ కారు ఢీ కొన్న ఘటనలో పట్టణానికి చెందిన బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి రామగోవిందు, వరలక్ష్మి దంపతులు దుర్మరణం చెందారు. అలాగే 6న అదే ప్రదేశంలో కారు బోల్తా పడిన ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో కోడుమూరు ఎస్సీ కాలనీకి చెందిన జయన్న మృతి చెందారు. ఆయన సతీమణి సంతోషమ్మతోపాటు మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతదేహం వెంట వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలు మరువకముందే శుక్రవారం కారు ప్రమాదంలో ముగ్గురు పట్టణ వాసులు మృతి చెందడం విషాదకరంగా మారింది. కోడుమూరు, ప్యాలకుర్తి, కొత్తూరు మధ్యలో డేంజర్ స్పాట్‌గా మారింది. గతంలోనూ ఈ గ్రామాల మధ్య జరిగిన ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు.

సీమలో పారిశ్రామిక విప్లవం


- ఏడు నెలల కూటమి పాలన భేష్
- ఆర్యవైశ్యులపై దాడులను ఖండిస్తున్నా
- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో పారిశ్రామిక విప్లవం వస్తున్నదని, తన కుమారుడు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ప్రాజెక్టుల స్థాపనకు నిరంతరం కృషి చేస్తున్నారని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ పేర్కొన్నారు. శుక్రవారం సంకల్‌భాగ్‌లోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 7 నెలల కూటమి ప్రభుత్వ పాలన భేషుగ్గా ఉందని, వంద శాతం సక్సెస్‌లో ఉందని అన్నారు. రాయలసీమకు వేల కోట్ల రూపాయలతో పరిశ్రమలు వస్తున్నాయన్నారు. దావోస్‌కు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ వెళ్తున్నారని, మరిన్ని పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు అనుభవం వల్ల రాష్ట్రంలో అభివృద్ధి వైపు పరుగులు పెడుతున్నదని అన్నారు. రాయలసీమ ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రం సమైక్యంగా ఉండాలని పోరాటం మొదలు పెట్టింది తామేనని, రాయలసీమ వెనుకబడి ఉందని, ఆధారాలతో సహా రాజకీయ పార్టీలకు ఇచ్చామని అన్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేసే దిశగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు మొదలు పెట్టాలన్నారు. విభజన హామీలకు తెలంగాణ రాజకీయ పార్టీలు కూడా సహకరించాలని టీజీ వెంకటేశ్ తెలిపారు. కేంద్రం నిధులిచ్చే ప్రాజెక్టులే రాష్ట్రంలో వేగంగా ముందుకు వెళ్తున్నాయన్నారు. ఎన్డీయే సహకారంతో గుండ్రేవుల ప్రాజెక్టును పూర్తి చేయాలని కోరారు. అలాగే వేదవతి ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాలని కోరారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, నారా చంద్రబాబు ప్రాజెక్టులపై దృష్టి సారించాలన్నారు. ఏపీ పారిశ్రామికవేత్తలు తెలంగాణలో ట్యాక్స్‌లు కడుతున్నారని, అందులో మన రాష్ట్రానికి రావాల్సిన వాటా రావడం లేదని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దీనిపై చొరవ చూపాలన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంటు, రైల్వేజోన్ ఏర్పాటు పనులు బీజేపీతో ముందుకు పోతున్నాయని అన్నారు. సిద్ధేశ్వరం వద్ద కృష్ణానదిపై నిర్మించే తీగలవంతెనకు బదులుగా ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మించాలని కేంద్ర మంత్రి గడ్కరీని కోరామని అన్నారు. కానీ గత ప్రభుత్వం అందుకు ప్రతిపాదనలు పంపకపోవడంతో ఆ ప్రాజెక్టు వెనక్కి వెళ్లిందన్నారు. బీజేపీ రాయలసీమ డిక్లరేషన్‌ను అమలు చేసి తీరుతామన్నారు. డోన్‌లో టీడీపీ నాయకుడిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, లేదంటే ఆందోళనలు మొదలవుతాయన్నారు. ఆర్యవైశ్యులపై దాడులను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని టీజీ తెలిపారు. కర్నూలుకు హైకోర్టు బెంచ్ గతంలోనే వచ్చేదని, కొంత మంది న్యాయవాదులు ఆందోళనలు చేయడం వల్ల ఆగిపోయిందని అన్నారు. కూటమి ప్రభుత్వం హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేస్తుందని టీజీ తెలిపారు.

జలవనరుల శాఖ ఎస్‌ఈగా ద్వారకనాథ్ రెడ్డి

- తెలుగుగంగ ప్రాజెక్ట్ ఎస్‌ఈగా శివప్రసాద్‌రెడ్డి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



కర్నూలు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జలవనరుల శాఖలో పని చేస్తున్న 43 మంది ఈఈలకు ఎస్‌ఈగా రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించిన విషయం తెలిసింది. వారికి శుక్రవారం వివిధ ఇరిగేషన్ సర్కిల్ ఎస్‌ఈలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) చూస్తున్న ఈఈలు వారి స్థానాలకు వెళ్లాల్సి వచ్చింది. కడప జిల్లా తెలుగుగంగ ప్రాజెక్టు డీఎస్‌ఈగా పనిచేస్తున్న ద్వారకనాథ్‌రెడ్డికి ఎస్‌ఈగా పదోన్నతి కల్పిస్తూ.. కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ ఎస్‌ఈగా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎస్‌ఈగా కొనసాగుతున్న బి.బాలచంద్రారెడ్డి అదే కార్యాలయంలో డీఎస్‌ఈగా కొనసాగాల్సి వచ్చిం ది. అలాగే నంద్యాల తెలుగుగంగ ప్రాజెక్ట్ సర్కిల్ ఎస్‌ఈగా ఎన్.శివప్రసాద్‌రెడ్డి నియమితుల య్యారు. కర్నూలు ఎస్‌ఈగా బాధ్యతలు చేపట్టబోతున్న ద్వార నాథ్‌రెడ్డి స్వస్థలం అనంతపురం. ఆయన తుమకూ రులో బీటెక్, అనంతపురం జేఎన్‌టీయూసీలో ఎంటెక్ చేశారు. 1989లో శ్రీసత్యసాయి జిల్లా కదిరి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ సర్కిల్‌లో ఏఈఈగా ఉద్యోగం లో చేరారు. 2004లో డీఈఈగా, 2013లో ఈఈగా పదోన్నది పొందారు. ఈయన ఎక్కువ కాలం తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్ఎల్‌సీ) సర్కిల్, శ్రీకాళహస్తి తెలుగుగంగ ప్రాజెక్ సీఈ ఆఫీస్, తిరుపతి టీజీపీ, జీఎన్ఎస్ఎస్ పని చేశారు. 2019 నుంచి కడప తెలుగుగంగ ప్రాజెక్ట్ సర్కిల్ డీఎస్ ఈగా పనిచేస్తూ ఇక్కడికి ఎస్‌ఈగా పదోన్నతిపై వస్తున్నారు. మూడు నెలల్లో పదవీ విమరణ చేయనున్నారు. హంద్రీనీవా ప్రాజెక్ట్ కర్నూలు సర్కిల్ ఎస్‌ఈగా ఎవరిని నియమించకపోవడం చర్చగా మారింది.

హంద్రీనీవా ఎస్ఈ ఎవరు?

హంద్రీనీవా ఎస్ఈ కోసం ఇటీవలే అనంతపురం జిల్లా హెచ్చెల్సీ ఈఈగా బదిలీపై వెళ్లిన రెడ్డిశేఖర్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల ఆయనకు కూడా ఎస్‌ఈగా పదోన్నతి లభించింది. గత వైసీపీ హయాంలో కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ ఇన్‌చార్జి ఎస్‌ఈగా పనిచేసిన ఆయన గత ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా పనిచేశారని జి.సుధాకర్ యాదవ్ అనే వ్యక్తి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారి, నాటి కలెక్టర్ జి.సృజన విచారణకు ఆదేశించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా తాను ఇన్‌చార్జిగా ఎస్‌ఈగా కొనసా గేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. మెజార్టీ ఎమ్మె ల్యేలు సహా మంత్రి టీజీ భరత్ కూడా ఒప్పుకోక పోవడంతో బదిలీపై వెళ్లక తప్పలేదు. ఎస్‌ఈగా పదోన్నది రావడంతో హంద్రీనీవా ప్రాజెక్ట్ కర్నూలు సర్కిల్ ఎస్‌ఈగా వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

నిందితుల అరెస్టు

- డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ హత్యాయత్నం కేసులో...
- కారు, ద్విచక్ర వాహనం సీజ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాసులు

డోన్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో గురువారం డోన్ పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ పి.శ్రీనివాసులు వివరాలు వెల్లడిం చారు. డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్ ఈ నెల 6వ తేదీ గుత్తి రోడ్డులో రాత్రి 9 గంటల సమయంలో స్కూటీపై వెళ్తుండగా.. వెనుక నుంచి కారుతో ఢీకొట్టి హత్యాయత్నం చేశారు. ఈ ఘటనలో నిందితులను పట్టుకుని, వారి వివరాలను శుక్రవారం డీఎస్పీ విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. డోన్ పట్టణం రాహుల్‌గాంధీ నగర్‌కు చెందిన సోమేష్ యాదవ్, నెహ్రూనగర్‌కు చెందిన ఆయన సోదరుడు సోమశేఖర్, మహ్మద్ రఫీ, సుందర్‌సింగ్ కాలనీకి చెందిన దూద్‌పీరా నిందితులుగా గుర్తించామని తెలిపారు. డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్ రాజకీయంగా ఎదుగు తున్నాడన్న అక్కసుతో హత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. అలాగే నిందితుడు సోమేష్ యాదవ్ తమ్ముడు శేఖర్ యాదవ్ ఇంటి నిర్మాణాన్ని పడగొట్టడం వెనుక మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్ ఉన్నాడనే ఉద్దేశంతో ఈ ఘటన జరిగిందని అన్నారు. సోమేష్ యాదవ్, ఆయన తమ్ముడు శేఖర్ యాదవ్ కలిసి మహ్మద్ రఫీ, అతని అనుచరుడు దూద్‌పీరాలతో కలిసి కారుతో యాక్సిడెంట్ చేసి హరికిషన్‌ను హత్య చేయాలనుకున్నారని డీఎస్పీ తెలిపారు. గత నెల 27న హరికిషన్ గుత్తి రోడ్డులోని లారీ ట్రాన్స్‌పోర్టు ఆఫీసుకు వెళ్తుండగా.. మొదటిసారి కారుతో ఢీకొట్టించి హత్య చేయాలని ప్రయత్నించి విఫలమయ్యారని, ఆ తర్వాత ఈ నెల 6వ తేదీన లారీ ట్రాన్స్‌పోర్టు ఆఫీసు నుంచి వస్తున్న హరికిషన్‌ను కారులో వేగంగా వెళ్లి ఢీకొట్టించారని తెలిపారు. ఈ ఘటనలో కోట్రికె హరికిషన్ చనిపోయాడని భావించి నింది తులు కారు దిగకుండా వేగంగా వెళ్లినట్లు డీఎస్పీ తెలిపారు. హ రికిషన్‌పై దాడికి వాడిన రాడ్లు, కారం పొడి ప్యాకెట్లు, కారు, బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి డోన్ కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. ఈ హత్యాయంత్నం కేసును ఛేధించడంలో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, రూరల్ సీఐ రాకేష్, ఎస్‌ఐలు శరత్ కుమార్ రెడ్డి, నరేంద్రకుమార్, క్రైం పార్టీ పోలీసులను డీఎస్పీ అభినందించారు. నిందితుల్లో ఒకరైన సోమేష్ యాదవ్ ఇటీవల వైసీపీ మండల అధ్యక్షుడిగా నియమితుడు అయ్యాడు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు



హత్యకు ఉపయోగించిన కారు



ఇళ్లు మంజూరు చేయాలి

మద్దికెర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంత పురం గ్రామంలోని పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ కార్యదర్శి నాగరాజు, రైతు సంఘం అధ్యక్షుడు హనుమన్న కోరారు. శుక్రవారం హౌసింగ్ ఏఈ ఉమాకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. ఇదివరకే ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకే మళ్లీ మంజూరు చేస్తున్నారన్నారు. ఇలా అయితే నిరుపేదలకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. గ్రామాల్లో సర్వే చేసి ప్రభుత్వ గృహాలు మంజూరు చేస్తే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. బురుజుల గ్రామంలో పక్కా గృహాలు ఇప్పిస్తామని దళారులు రంగప్రవేశం చేశారని, దీనిని అరికట్టాలని కోరారు.

కాలువను పొడిగించాలి : సీపీఐ

పత్తికొండ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పందికోన రిజర్వాయరు కింద ఎడమ కాలువను పొడిగించి, పంట పొలాలకు సాగునీరు అందించాలని సీపీఐ కార్యదర్శి రాజాసాహెబ్, రైతు సంఘం కార్యదర్శి సురేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రం ఇచ్చారు. కారన్న, గురుదాస్, సిద్దలింగప్ప, కారుమంచి, పెద్దముని, నెట్టికంటయ్య, ఉప్పరి శ్రీనివాసులు, ఉపేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలి

ఆదోని టౌన్, జనవరి17 (ఆంధ్రజ్యోతి): కబ్జాల తొలగింపుపై హైకోర్టు ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని విరాట్ హిందూస్తాన్ సంఘ్ అధ్యక్షుడు రామాంజినేయులు కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతి పత్రం ఇచ్చారు. ప్రభాకర్ టాకీస్ ప్రాంతంలోని శంభులింగేశ్వర ఆలయం ఎదురుగా ఇంటి నెం.18-139లో 76 సంవత్సరాలుగా రీడింగ్ రూమ్ నిర్వహిస్తున్నామన్నారు. కొందరు కబ్జాకు పాల్పడగా హైకోర్టును ఆశ్రయించామని, తొలగించాలని హైకోర్టు 2018లో ఇచ్చిన ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. హై కోర్టు ఉత్తర్వులను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. అడివేష్, వీరేష్ పాల్గొన్నారు.

వలస వెళ్లొద్దు.. ఉపాధి కల్పిస్తాం



వ్యవసాయ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

పత్తికొండ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కూలీలు వలస వెళ్లొద్దని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీడీవో సువర్ణలత కోరారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'వలసబాట' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఎంపీడీవో, ఏపీడీ పక్కీరప్ప, ఏపీవో వెంకటేశ్వర్లు పట్టణం, గ్రామాల్లో పర్యటించి కూలీలతో మాట్లాడారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

ఆలూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ సూచించారు. శుక్రవారం మాట్లాడుతూ శనివారం పార్టీ కార్యాలయంలో వర్ధంతి అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేస్తుమన్నారు. అభిమానులు, కార్యకర్తలు పాల్గొనాలని సూచించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సదుల్లా తెలిపారు. వివరాల మేరకు.. మండలంలోని అరేకల్లు గ్రామానికి చెందిన తలారి సరసయ్య 17 బాక్సులను తరలిస్తుండగా అరెస్ట్ చేశారు. అలాగే బోయగేరికి చెందిన బోయ మద్దిలేటి నుంచి 30 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రేపు కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

ఆదోని అగ్రికల్చర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో ఈనెల 19న కబడ్డీ జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, సహాయ కార్యదర్శి అమర్ ప్రకాష్ తెలిపారు. క్రీడాకారులు ఆధార్ కార్డుతోపాటు పురుషులు బరువు 85 కేజీలలోపు, మహిళలు 75 కేజీలోలపు ఉండాలన్నారు. విశాఖ పట్నం జిల్లా అనకాపల్లిలో ఈనెల 25 నుంచి 27 వరకు జరిగే పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 9701012329 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న అధికారులు

మద్దికెర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్, పీఆర్ ఏఈ విష్ణు సూచించారు. శుక్రవారం బురుజుల గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. రూ.2కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపేస్తామని, కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు కబడ్డీ పోటీలు

తుగ్గలి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉరుసు సందర్భంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నల్లగుండ్ల రవి శుక్రవారం తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.20,016 దాత కోళ్ల రంగన్న, రెండో బహుమతి దాత మజీద్ రూ.15,016, మూడో బహుమతి రూ.10,016 దాత టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు సత్యప్రకాష్, నాలుగో బహుమతిని రూ.5,016లు టీడీపీ నాయకుడు దేవదాసు గౌడ్ ఇస్తున్నారన్నారు. వివరాలకు 9390667893, 9398232085 నెంబర్లను సంప్రదించాలన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం

దేవనకొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణతోనే వ్యాధులు దూరం అవుతాయని వైద్య సిబ్బంది రంగస్వామి, సాయి బాబా అన్నారు. శుక్రవారం మండలంలోని బేతపల్లిలో డ్రైడే నిర్వహించారు. ఇళ్లలో నీరు నిల్వ ఉండకుడా చూసుకోవాలని, జ్వరం వస్తే రక్తపరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఏఎన్ఎం రాదాబాయి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

మద్దికెర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోలు గ్రామాల్లో రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ ఆదేశించారు. శుక్రవారం కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులు వస్తే స్వీకరించాలన్నారు. రైతుల భూ సమస్యలను పరిశీలించి ఆన్‌లైన్ చేయాలని కోరారు.

సమస్యలు తిష్ఠ

- ఆదోని కపర్థి నగర్ దుస్థితి
- డ్రైనేజీ లేదు, నిర్వహణా లేదు
- పత్తాలేని మున్సిపల్ అధికారులు
- ముళ్లకంపతో నిండిన పార్కులు



బురద రోడ్డే గతి.. కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారి

ఆదోని టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలోని కపర్థినగర్‌లో 10వేల మంది జనాభా నివసిస్తున్నారు. కాలనీలో చాలాకాలంగా సమస్యలు తిష్ఠ వేశాయి. తమ సమస్యలను పరిష్కారించాలని వార్డు సచివాలయ సిబ్బందికి పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోతోందని కాలనీవాసులు వాపోతున్నారు. ఎస్కేడీ కాలనీకి సమీపంలోనే ఉండటంతో ఇక్కడి స్థలాలకు డిమాండ్ పెరిగింది. జనాభా పెరిగి సచివాలయం ఏర్పాటైనా సమస్యలు మాత్రం తీరలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పార్కుల్లో కనిపించని ఆహ్లాదం

కాలనీలోని నాలుగు పార్కులుండగా వీటిలో ఆహ్లాదం ఏమాత్రం కనపించడం లేదు. దీంతో ఇవి నిరూపయోగంగా పడి ఉన్నాయి. శిల్పా సౌభాగ్య అపార్ట్‌మెంట్ పక్కనున్న ఒక ఖాళీ స్థలానికి మాత్రం ప్రహరీ నిర్మించారు. కేవలం కొన్ని బెంచీలు ఏర్పాటు చేసి వదిలేశారు. ముళ్లకంప ఉండటంతో పార్కులో అడుగు పెట్టే అవకాశం లేదు. వాకింగ్ ట్రాక్, పిల్లలకు ఆటవస్తువులు లేవు.

డ్రైనేజీ వ్యవస్థ చిన్నాభిన్నం

ఈ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వస్తోంది. రోడ్లు కూడా సరిగి లేకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని స్థానికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గాడాంధకారం

విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాత్రిళ్ల బయటకు రావాలంటనే జంకుతున్నారు. ఎక్కడ ఏముందో తెలియడం లేదని వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి, కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



అదుపు తప్పితే అంతే..ప్రమాదకరంగా గుంత

పత్తాలేని సిబ్బంది

పట్టణంలో పారిశుధ్య పనులు చేయించాల్సిన మున్సిపల్ సిబ్బంది పత్తాలేరని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. బయటకు రావాలంటే ముక్కు మూసుకోవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందిచాలని కోరుతున్నారు.

గతంలో బాలికకు ప్రమాదం

కాలనీలోని విద్యుత్ స్తంభం నెం. 127/27 ఎదురుగా రోడ్డు మధ్యన గుంత ఏర్పడింది. గమనించని బాలిక రాత్రివేళ ప్రమాదానికి తీవ్ర గాయాలపాలై మంచానికే పరిమితమైంది. అధికారులు స్పందించి, అభివృద్ధి పనులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



సమస్యలతో ఇబ్బంది..

కాలనీలో డ్రైనేజీ లేక దుర్గంధం వస్తోంది. దోమలు ప్రబలి అంటు రోగాలు వ్యాపిస్తున్నాయి.

- హనుమంత రెడ్డి

సచివాలయ సిబ్బంది స్పందించాలి



కాలనీ సమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బంది స్పందించాలి. కాలనీలో ఒక పార్కు కూడా అభివృద్ధి చేయకపోవడం సరికాదు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

- శ్రీనివాస ఆచారి, టీడీపీ నాయకుడు

సీఎం సహాయ నిధి పేదలకు వరం

- చెక్కులు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, ఎమ్మెల్యే శ్యాంబాబు



ఆదోనిలో బాధితులకు చెక్కు పంపిణీ చేస్తున్న మీనాక్షినాయుడు



పత్తికొండలో చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

ఆదోని, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు అన్నారు. మండలంలోని పెద్దతుంబలం, అలసంద గుత్తి, గ్రామాల లబ్ధిదారులకు శుక్రవారం చెక్కులను అందజేశారు. పెద్ద తుంబలం గ్రామానికి చెందిన శంకరప్పకు రూ.38,700లు అలసందగుత్తి గ్రామానికి చెందిన లక్ష్మికి రూ.62,729లను అందజేశారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పత్తికొండ: బాధితులకు సీఎం సహాయ నిధి వరమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో 6మంది బాదితులకు రూ.3,80లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. సాంబశివారెడ్డి, తిమ్మయ్యచౌదరి, బీటీ గోవిందు, తిప్పన్న, కడవలసుధాకర్, తిరుపాల్‌నాయుడు ఉన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు లబ్ధి



మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు లబ్ధి చేకూరుతుందని ఆ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. శుక్రవారం ఉప్పర్లపల్లి గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు అప్పా వేణు స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 1.50 కోటికిపైగా సభ్యత్వం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. అలాగే నియోజకవర్గంలో తుగ్గలి మండలంలో కూడా అత్యధిక సభ్యత్వాలు నమోదయ్యాయన్నారు. టీడీపీ పేదల పార్టీ అని, పేదల కష్టాలు తీర్చేందుకే ఎన్టీఆర్ పార్టీని స్థాపించారన్నారు. ఆయన ఆశయాల సాధనకే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ప్రజలకు సంక్షేమ పథకాలతో అభివృద్ధి పనులు చేపడుతున్నా రన్నారు. అప్పా వేణు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులుగౌడు, ప్రసాద్, ఈశ్వరయ్య, జగన్మోహన్, విశ్వనాథ్, కంబగిరి, పోస్టు వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే మంజూరు

ఆదోని టౌన్, జనవరి17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకే ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇస్తామని మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణ సింగ్ అన్నారు. శుక్రవారం కార్యాలయంలో ఎల్‌టీపీలతో సమావేశం నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించకుండా ఆన్‌లైన్‌లో ప్లాన్లను అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం టీపీవో బాలమద్దయ్య మాట్లాడుతూ, అక్రమణలను, అనధికార కట్టడాలను ఉపేక్షించేది లేదన్నారు. ఎల్‌టీపీలు రంగస్వామి, విజేం ద్రనాథ్ ప్రసాద్, ఈరన్న పాల్గొన్నారు

సారా బట్టీల ధ్వంసం

ఆదోని, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్లమ్మ కొండలలో సారా బట్టీలను ధ్వంసం చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు అరెస్టు చేసి 30 లీటర్ల బెల్లం ఊటను ధ్వంశం చేసినట్లు వచ్చిన సమాచారంల మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు.

పని వేళలు పాటించకుంటే చర్యలు : పీడీ



రికార్డులను పరిశీలిస్తున్న పీడీ నిర్మల

వెల్దుర్తి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పని వేళలు పాటించని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలపై చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ పీడీ నిర్మల హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని చెరుకుల పాడు గ్రామంలో అంగన్‌వాడీ 1, 2 కేంద్రా లను తనిఖీ చేశారు. సెంటర్-1 లో టీచర్ అనంతమ్మ ఆలస్యంగా రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అలాగే మండలంలోని బుక్కాపురం గ్రామంలోని అంగన్‌వాడీ 1, 2 కేంద్రాలను ఐసీడీఎస్ సీడీపీవో లూక్ పరిశీలించారు.

చెరువును ఆక్రమించుకుంటున్నా కనిపించదా?

- ఎమ్మెల్యే విరుపాక్షి



చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చెరువు ఆక్రమణలకు గురవుతుంటే అధికారులకు కనిపించలేదా? అని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి మండిపడ్డారు. శుక్రవారం ఆక్రమణకు గురైన చెరువును పరిశీలించారు. చెరువు ప్రజల ఆస్తి అని కాపాడుకునే బాధ్యత కూడా మనదే అన్నారు. చెరువులో రాళ్ళు పాతుతుంటే రెవెన్యూ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఇందులో మీరు ఎంత తీసుకున్నారని ప్రశ్నించారు. అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇక మీదట చెరువు నుంచి అనాధికారికంగా గ్రావెల్‌ను తరలిస్తే సహించబోమన్నారు. వైసీపీ నాయకులు చిన్న ఈరన్న, గిరి, మాజీ ఎంపీటీసీలు భాస్కర్, పెట్రోల్ బంక్ కిషోర్, మండల నాటకులు అరికెర వెంకటేష్, వీరేష్, ఊరుకుంద, ఎల్లప్ప బాబు పాల్గొన్నారు.

ఆక్రమించేవారు ఏ పార్టీవారైనా ఉపేక్షించం

- టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్



మాట్లాడుతున్న టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చెరువును ఆక్రమించే వారు ఏ పార్టీవారైనా ఉపేక్షించబోమని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ ఆలూరు చెరువును అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నిర్మించి ప్రజల దాహార్తిని తీరుస్తామన్నారు. చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులను కోరామని, సంరక్షించాలని సూచించామని తెలిపారు.

పోటాపోటీగా టెండర్లు

ఆదోని అగ్రికల్చర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు క్యాంటీన్ నిర్వహణకు శుక్రవారం కాంట్రాక్టర్లు పోటీపడి టెండర్లను దాఖలు చేశారు. కూటమిలోని టీడీపీ, బీజేపీ నాయకులు టెండర్లు వేసేందుకు పోటీపడ్డారు. మరోవైపు వైసీపీ నాయకులు కూడా టెండర్లు వేశారు. పోలీసు బందోబస్తు మధ్య మధ్యాహ్నం రెండు గంటల వరకు అధికారులు టెండర్లను స్వీకరించారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు టెండర్ బాక్సును కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెరలిచారు. కడప మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజినేయులు ఇక్కడకు రాకపోవడంతో టెండర్లను ఆయన పరిశీలన కోసం పంపామని కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెలిపారు.

నేడు పత్తికొండలో రక్తదాన శిబిరం

తుగ్గలి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం దివంగత ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని పత్తికొండలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని పార్టీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు తిరుపాల్ నాయుడు, వెంకట్రాముడు చౌదరి అన్నారు. శుక్రవారం తుగ్గలిలో మాట్లాడుతూ పత్తికొండ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్యాంబాబు ప్రారంభిస్తారన్నారు.

నేడు వెల్దుర్తికి ఎమ్మెల్యే శ్యాంబాబు

వెల్దుర్తి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి శనివారం ఎమ్మెల్యే శ్యాంబాబు వస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు బలరాంగౌడ్ తెలిపారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ కొత్తబస్టాండ్ వద్ద పార్టీ కార్యాలయంలోఎన్టీఆర్ వర్ధంతిలో పాల్గొంటారని అన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ఆదోని టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కార్వాన్‌పేటకు చెందిన వృద్ధులకు లయన్స్ క్లబ్ సభ్యులు శుక్రవారం తెల్లవారుజామున దుప్పట్లను పంపిణీ చేశారు. క్లబ్ జిల్లా చైర్మన్ డా.గోపీనాథ్, చైర్మన్ ప్రసాదరావు, పట్టణ అధ్యక్షుడు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్ గుప్తా, ఓం ప్రకాష్, వన్నప్ప రాజు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

పత్తికొండ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో నిర్వహిచనున్న 22వ రాష్ట్ర ఏఐవైఎఫ్ మహా సభలను జయప్రదం చేయాలని ఉపాధ్యక్షుడు కారుమంచి పిలుపునిచ్చారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో పోస్టర్లను విడుదల చేశారు. ఫిబ్రవరి 6వ తేదీ నుంచి 9 వరకు ఉంటాయన్నారు. రాజాసాహెబ్, హనుమేష్, ఉపేంద్ర, సిద్దు, రామాంజనేయులు, పెద్దహుల్తి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: ప్రైవేటు రంగంలో నిరుద్యోగులకు రిజర్వేషన్లు కల్పించాలని ఏఐవైఎఫ్ కార్యదర్శి రమేష్, లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆస్పరిలో ఏఐవైఎఫ్ 22వ మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. శేఖర్, సుధా, శ్రీను, విజయ్ పాల్గొన్నారు.

కందులు కొనాలి

ఆలూరు రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కందులను కొనాలని టీడీపీ రైతు కమిటీ తాలూకా అధ్యక్షుడు కురవ దేవేంద్రప్ప కోరారు. శుక్రవారం మాట్లాడుతూ మార్కెట్‌లో వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర రూ.9వేల చొప్పున కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నాగరాజు, మారెన్న, ఉసేని పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

మద్దికెర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీవో లలిత, ప్రత్యేక అధికారి ఉమాదేవి హెచ్చరించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో కిషోరి వికాసం శిక్షణ నిర్వహించారు. బాల్య వివాహాలతో ప్రసవ సమయంలో ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ఆడపిల్లలను చదివిస్తే భవిష్యత్తు ఉంటుందన్నారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్ఠికాహారం, భోజనం అందించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి, ఎంపీడీవో కొండయ్య ఉన్నారు.

27న వేలం పాటలు

పత్తికొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులికొండ రంగనథ ఆలయం తలనీలాల వేలంపాటలు 27న నిర్వహిస్తున్నట్లు ఈవో వీరయ్య శుక్రవారం తెలిపారు. ఫిబ్రవరి 6 నుంచి 2026 ఫిబ్రవరి తలనీలాల హక్కు ఉంటుందన్నారు. పాల్గొనేవారు రూ. లక్ష ధరావతు చెల్లించాలని, అలాగే టెంకాలయల వేలానికి రూ.25వేలను చెల్లించాలన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో సూత్రధారి అరెస్టు

- మిగతా వారి కోసం పోలీసుల గాలింపు

ఆదోని, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సర్వే నెంబరు 321-ఏలో రూ.30కోట్ల విలువ చేసే 6.51 ఎకరాల స్థలం తనదేనని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని 2024 డిసెంబరు 31న మరొకరికి రిజిస్ట్రేషన్ చేయించిన నంద్యాలకు చెందిన ప్రధాన సూత్రధారి ఆముదాల భాస్కర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ సూర్యమోహన్‌రావు ఆధ్వర్యంలో డీఎస్పీ సోమన్న ప్రధాన సూత్రధారి భాస్కర్‌ను విలేకరులు ఎదుట ప్రవేశ పెట్టారు. డీఎస్పీ మాట్లాడుతూ భూ యజమాని ఎగ్గటి ఈశ్వరప్ప బతికుండగానే మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ కార్డు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సృష్టించి నకిలీలను ఏర్పాటు చేసుకొని మరొకరికి రిజిస్ట్రేషన్ చేయించారు. విషయం తెలుసుకున్న భూ యజమాని ఈశ్వరప్ప సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి అక్రమ రిజిస్ట్రేషన్ చేశారంటూ సబ్ రిజిస్ట్రార్ వద్ద ఆందోళన చేసి అధికారులను నిలదీశారు. ఈశ్వరప్ప టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ సూర్య మోహన్ రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఇప్పటి దాకా భాస్కర్‌తో పాటు ఐదుగురిని అరెస్టు చేయగా అసలైన మరో సూత్రధారులైన సబ్ రిజిస్ట్రార్ హాజిమియా, పొలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్న గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన చాకలి ఈరన్నతో పాటు మరో ఇద్దరు సాక్షులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. చాకలి ఈరన్నపై ఎమ్మిగనూరులో సైతం దొంగ రిజిస్ట్రేషన్‌లో చేయించినట్లు అక్కడ కూడా కేసులు నమోదయ్యాయని తెలిపారు. చాకలి ఈరన్న పొలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్న వెంటనే మరో ఇద్దరికి రూ.20 లక్షలకు రెండు ప్లాట్లు, కురువ అయ్యన్నకు 11 సెంట్లు, కురువ చిన్నయ్యకు 10.50సెంట్లు విక్రయించినట్లు తెలిపారు. సబ్ రిజిస్ట్రార్‌తో పాటు చాకలి ఈరన్న దొరికితే అసలు విషయాలు బయటకు వస్తాయని డీఎస్పీ తెలిపారు. మిగతా నలుగురు కోసం ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి గాలిస్తున్నామని చెప్పారు. వీరందరినీ కస్టడీకి తీసుకొని మరోసారి విచారిస్తామని వదిలే ప్రసక్తే లేదని అన్నారు.

ఆవకాయ, మాగాయి, నిమ్మకాయ...
ఇలా రకరకాల నిల్వ పచ్చళ్లు తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయని...
అందువల్ల ఎక్కువగా తినవద్దని... తాజా కూరగాయలతో
తయారుచేసిన పచ్చళ్లనే తినమని
డాక్టర్లు సూచిస్తూ ఉంటారు.
అలాంటి కొన్ని పచ్చళ్ల తయారీ...
మీ కోసం.



వంటిల్లు

తాజా తాజా చట్నీలు

మిక్స్‌డ్ వెజిటబుల్ చట్నీ

కావాల్సిన పదార్థాలు:

ఉల్లిపాయ ముక్కలు- పావు కప్పు, తరిగిన పచ్చిమిర్చి- రెండు చెంచాలు, తరిగిన అల్లం: అర చెంచా, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, పసుపు- అర చెంచా, టమోటా ముక్కలు- ఒక కప్పు, కేరట్- అర కప్పు, బీన్స్- పావు కప్పు, కాలీఫ్లవర్- అర కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు చెంచాలు, చింతపండు రసం- రెండు చెంచాలు, పంచదార- ఒక చెంచా, ఉప్పు- తగినంత, నూనె- పావు కప్పు, ఆవాలు- ఒక చెంచా, మినపప్పు- ఒక చెంచా, జీలకర్ర- ఒక స్పూను, ఎండు మిరపకాయలు- రెండు, ఇంగువ- తగినంత

తయారీ విధానం:



- కేరట్, బీన్స్, కాలీఫ్లవర్ ముక్కలను కుక్కర్‌లో ఒక విజిల్ వచ్చే దాకా ఉడికించాలి. ఆ తర్వాత బయటకు తీసి చల్లార్చాలి.
- ఒక మూకుడులో నూనె తీసుకొని అందులో తరిగిన ఉల్లిపాయలు, అల్లం, పచ్చిమిర్చి ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి దోరగా వేయించాలి. చివరగా పసుపు వేయాలి.
- ఆ మిశ్రమంలోనే టమోటాలు వేసి ఉడకనివ్వాలి. తరువాత ఉడికించిన కూర ముక్కలు వేయాలి. పంచదార కలపాలి.
- కూర ముక్కల్లోని నీళ్ల ఆవిరి అయ్యేదాకా మగ్గనివ్వాలి. ఈ మిశ్రమాన్ని కిందకు దింపి చల్లారనివ్వాలి.
- ఒక మిక్సీలో ఈ మిశ్రమాన్ని, కొత్తిమీర, చింతపండు రసం, ఉప్పు వేసి ముద్దగా చేయాలి. దీనిని ఒక గిన్నెలో పెట్టుకోవాలి.
- వేరే మూకుడులో కొద్దిగా నూనె వేసి ఆవాలు, మినపప్పు, జీలకర్ర, ఎండు మిరపకాయలు, ఇంగువ వేసి వేయించాలి. దీనిని గిన్నెలోని పచ్చడిలో కలపాలి.

జాగ్రత్తలు:

- పంచదార వేయటంవల్ల పచ్చడిలో ఉన్న ఆమ్ల లక్షణాలు తొలగిపోతాయి. తినటానికి కమ్మగా ఉంటుంది.
- ఈ పచ్చడిలో టమోటా ముక్కలు ఎక్కువ వేయకూడదు.

ముల్లంగి ఆకుల చట్నీ



కావాల్సిన పదార్థాలు:

తరిగిన కొత్తిమీర- అర కప్పు, ముల్లంగి ఆకులు- అర కప్పు, ముల్లంగి ముక్కలు- పావు కప్పు, వెల్లుల్లి రెబ్బలు- ఆరు, పచ్చిమిర్చి ముక్కలు- రెండు చెంచాలు, తరిగిన అల్లం ముక్కలు- అర చెంచా, నూనె- రెండు చెంచాలు, నిమ్మకాయ రసం- నాలుగు చెంచాలు, ఉప్పు- తగినంత

తయారీ విధానం:

- మూకుడులో నూనె వేసి కొత్తిమీర, ముల్లంగి ఆకులు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి దోరగా వేయించాలి.
- ఈ మిశ్రమం చల్లారిన తర్వాత మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.
- ఆ మిశ్రమంలోనే ముల్లంగి ముక్కలు, ఉప్పు వేసి బాగా ముద్దగా చేయాలి. అందులో నిమ్మకాయ రసం కలపాలి.

జాగ్రత్తలు:

- కొన్నిసార్లు ముల్లంగి చేదుగా ఉంటుంది. అలాంటి ముల్లంగిని వాడకూడదు. లేత ముల్లంగి ఆకులతో మంచి రుచి వస్తుంది.
- నిమ్మ రసం కూడా తగినంత చేర్చుకోవాలి. నిమ్మ రసం ఎక్కువ అయినా రుచి బాగుండదు.

చేమ ఆకుల చట్నీ



కావాల్సిన పదార్థాలు:

సన్నగా తరిగిన చేమ ఆకులు- రెండు కప్పులు, పచ్చిమిర్చి ముక్కలు- మూడు స్పూన్లు, చింత పండు రసం- రెండు చెంచాలు, బెల్లం పొడి- రుచికి తగినంత, కొబ్బరి తురుము- నాలుగు చెంచాలు, వేయించిన నువ్వులు- రెండు చెంచాలు, నూనె- పావు కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు స్పూన్లు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం:

- ఒక మూకుడులో నూనెను వేడి చేయాలి. దీనిలో చేమ ఆకులు, పచ్చిమిర్చి ముక్కలు వేయించాలి.
- ఈ మిశ్రమంలో చింతపండు రసం, బెల్లం పొడి, కొద్దిగా నీళ్లు పోసి బాగా ఉడకబెట్టాలి. కిందకు దింపి చల్లార్చాలి.
- మరో మూకుడులో కొబ్బరి తురుము, నువ్వులు దోరగా వేయించాలి. ఇవి చల్లారిన తర్వాత మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి.
- ఈ పొడిలో చేమ ఆకుల మిశ్రమం, ఉప్పు వేసి ముద్దగా చేసుకోవాలి. తరిగిన కొత్తిమీర కలపాలి.

జాగ్రత్తలు:

- లేత చేమ ఆకులు రుచిగా ఉంటాయి. అయితే ఇవి ఉడకటానికి మామూలు ఆకు కూరల కన్నా ఎక్కువ సమయం పడుతుంది.
- బెల్లం బదులు పంచదార కూడా వేసుకోవచ్చు

కేరట్ మనదే!

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

'కేరో' అనే ఇండో-యూరోపియన్ మూల పదానికి 'కొమ్ము' ఆకారంలో ఉండేదని అర్థం. పసుపుకొమ్ము, శొంఠి కొమ్ము లాగానే 'కేరెట్ కొమ్ము' అని వాడేవారు. చాలామంది ఇది విదేశాల నుంచి మనకు దిగుమతి అయిన దుంప అని భావిస్తారు. వాస్తవానికి ఈ దుంప మన దేశంలో కొన్ని వేల ఏళ్లుగా పండుతోంది. మన ప్రాచీన ఆయుర్వేద గ్రంథాలు గుంజన దుంపలు, గాజర గడ్డలనే పేర్లతో కేరట్‌నే పేర్కొన్నాయి. 16వ శతాబ్ది నాటి భోజన కుతూహలం, 17వ శతాబ్ది నాటి హంసవింశతి గ్రంథాలలో ఈ దుంప ప్రస్తావన ఉంది.

మనకు దొరికే గాజర దుంపలు లేత కాషాయ రంగులో ఉంటాయి. ఇవి మిగిలిన రంగుల్లో కూడా మనకు లభ్యమవుతాయి. కేరట్ కాయలను మెరికార్స్ అంటారు. మానవ శరీరంలో నిర్మాణ క్రియలకు సమస్యలు ఏర్పడిన పుడు వాటిని సరి చేసే గుణం వీటికుంది. ఇక కేరట్‌లోని బీటాకెరోటీన్ అనే పదార్థంవల్ల ఆ దుంపలకు కాషాయ వర్ణం ఏర్పడుతుంది. సాధారణంగా మొక్కల్లోని కణాలను అల్ట్రావయెలెట్ కిరణాల నుంచి ఈ బీటాకెరోటిన్ కాపాడుతూ ఉంటుంది. అందువల్లే కేరట్‌ను తింటే బీటాకెరోటిన్ శరీరానికి అందుతుంది. చర్మం నిగనిగలాడుతుంది. అంతే కాకుండా కంటి చూపు మెరుగుపరచటానికి కూడా కేరట్ ఉపకరిస్తుంది. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటిష్ సైనికులకు కంటి చూపు మెరుగుపరచటం కోసం కేరట్‌ను ఆహారంగా పెట్టేవారట!



కేరట్, ముల్లంగి, కీర... ఈ మూడు దుంపలను సమాన పరిణామాల్లో తీసుకొని జ్యూస్ చేసుకొని రోజూ ఉదయం తాగితే శరీరంలోని అనేక రకాల రోగాలు తగ్గుతాయి. దీనిలో కొద్దిగా పెరుగు కలిపినా మంచిదే.

'భోజన కుతూహలం' గ్రంథం ప్రకారం కేరట్ వల్ల కలిగే ప్రయోజనాలివి...

- కేరట్‌లు కఫ దోషాలను పోగొడతాయి. కడుపు ఉబ్బరాన్ని, ఆమ్లాలను తగ్గిస్తాయి.
- నులిపురుగులను అరికడతాయి. కడుపునొప్పి వంటి సమస్యలకు ఔషధంగా పని చేస్తాయి.
- శరీరంలో వేడి తగ్గుతుంది. చలవ చేస్తుంది. దప్పిక కూడా తగ్గుతుంది.
- స్త్రీలలో రక్తస్రావాన్ని అరికట్టడానికి ఇవి ఉపకరిస్తాయి
- అమీబియాసిస్ వ్యాధి ఉన్నవారికి కేరట్‌వల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయి.

● గంగరాజు అరుణాదేవి

దుస్తులపై మరకలా... వదిలించండిలా...


ఒక్కోసారి బట్టలపై అనుకోనివిధంగా మరకలు పడుతుంటాయి. సబ్బుతో ఉతికినా, వాషింగ్ మెషిన్‌లో వేసినా అవి పోవు. కొన్ని చిట్కాలు పాటించి మొండి మరకలను సైతం సులువుగా పోగొట్టుకోవచ్చు. వాటి గురించి తెలుసుకుందాం!

- బట్టలపై సిరా మరకలు పడితే వాటి మీద కొద్దిగా శానిటైజర్ లేదా పెర్ఫ్యూమ్ చల్లి దూదితో రుద్దాలి. ఒక చెంచా బేకింగ్ సోడాని నీళ్లతో తడిపి ముద్దలా చేసి ఈ మిశ్రమంతో రుద్దినా సిరా మరకలు వెంటనే పోతాయి. మరక మీద కొద్దిగా డెటాల్ వేసి అయిదు నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత టూత్ బ్రష్‌తో రుద్దితే మరక పోతుంది.
- బట్టల మీద టీ లేదా కాఫీ ఒలికి మరకలు పడుతుంటాయి. అలాంటపుడు ఒక గిన్నెలో ఒక చెంచా నిమ్మరసం, ఒక చెంచా వైట్ వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో మరకమీద రుద్దితే ఫలితం ఉంటుంది. మరక మీద టూత్ పేస్ట్ రాసి పది నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత వేడి నీళ్లతో కడిగి సబ్బుతో ఉతికితే మరకలు పోతాయి.
- పార్కులో కూర్చున్నపుడు లేదా తోటపనిచేసినపుడు బట్టల మీద మరకలు ఏర్పడుతుంటాయి. అర బకెట్ నీళ్లలో అయిదు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపండి. ఈ నీళ్లలో బట్టలను గంటసేపు నానబెట్టి తరవాత సబ్బుతో ఉతికితే మరకలన్నీ పోతాయి. టమాటా, తుప్పు, జ్యూస్, రక్తం మరకలను కూడా ఈవిధంగానే పోగొట్టవచ్చు.
- చాక్లెట్ మరకలైనపుడు ఆ బట్టలను.... బట్టల సోడా కలిపిన నీళ్లలో అరగంటసేపు నానబెట్టి సబ్బుతో ఉతికితే చాలు.
- బట్టలను వాషింగ్ మెషిన్‌లో వేసినపుడు కొన్నిటి రంగులు మిగతా వాటికి అంటుకుంటుంటాయి. సబ్బుతో రుద్దినా ఆ మరకలు పోవు. వాటి మీద 90 శాతం ఆల్కహాల్ ఉన్న ద్రావణాన్ని చల్లి దూదితో రుద్దితే రంగుల మరకలు పోతాయి.
- రక్తం మరకలు పడినపుడు వాటి మీద హైడ్రోజన్ పెరాక్సైడ్ ద్రావణం చల్లి అరగంటసేపు ఉంచాలి. తరవాత సబ్బుతో ఉతికితే మరకలు పోతాయి.
- నూనె మరకలు పడినపుడు వాటి మీద డిష్ వాషింగ్ లిక్విడ్ లేదా బేకింగ్ సోడా చల్లి అరగంట తరవాత టూత్‌బ్రష్‌తో రుద్దితే చాలు.
- బకెట్ వేడి నీళ్లలో కొద్దిగా సర్ఫ్, కొద్దిగా బట్టల సోడా వేసి బాగా కలిపి అందులో బట్టలను నానబెట్టాలి. అరగంట తరవాత వాటిని సబ్బుతో ఉతికి ఎండలో ఆరవేస్తే తెలికపాటి మరకలన్నీ పోతాయి.



చిత్రజ్యోతి
SINCE 1965

నేడు ఎన్టీఆర్ 29వ వర్ధంతి



పురాణ పరిజ్ఞానంలోనూ అన్నగారు మిన్న!

'ధన, రుణ సమ్మిళితం శక్తి-తత్ఫలితం సృష్టి' అన్నది అనాదిగా జగమెరిగిన సత్యం! పాజిటివ్, నెగిటివ్ అన్నవి లేకుంటే పవర్ లేదన్న విషయం సైన్స్ కూడా ధ్రువీకరిస్తోంది. దీనిని అనుసరించే కళలు కాంతులీనాయని ప్రతీతి. రచనలోనూ ఈ విషయాన్నే స్మరిస్తూ ఓ కథలోని ప్రధాన పాత్రల్లోని తప్పొప్పులను విశదీకరిస్తూ సాగారు. వేద వ్యాస భగవానుడు కూడా అదే తీరున పంచమ వేదం మహాభారతాన్ని రచించారు. యూదు, క్రైస్తవ, ఇస్లామ్ మతస్థులు పవిత్రంగా భావించే మోజెస్ రచనలు సైతం ఇదే పంథాను అనుసరించాయని చెప్పవచ్చు. ఇవన్నీ తెలుగు చిత్రసీమలో పౌరాణికాలతో కళాఖండాలు తెరకెక్కించిన వారికి తెలియనివి కావు. అలాగే ప్రపంచంలోనే అత్యధిక పౌరాణిక చిత్రాల్లో నటించిన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావుకు కూడా ఆ పురాణపరిజ్ఞానం ఉందనే విషయాన్ని ఆయన తెరకెక్కించిన పురాణగాథలు చెప్పకనే చెబుతాయి.

● ఈ మధ్య ఎన్టీఆర్ పుట్టిన గడ్డపైనే నిల్చుని అనంతమైన అవివేకం ప్రదర్శిస్తూ కర్ణుని పాత్రను గొప్పగా చిత్రీకరించడం తప్పు అని ఇంకా ఏవేవో చెప్పారు. 'దానవీరశూర కర్ణ'లో కర్ణుడిని గొప్పగా చూపించడం వల్లే తరువాతి తరాల వారు కర్ణ పాత్రను ఎంతో ఉదాత్తంగా భావిస్తున్నారని వారి భావన! నిజానికి ఎన్టీఆర్ కంటే ముందు కూడా ఎంతోమంది కర్ణుని గొప్పతనం గురించి పౌరాణిక చిత్రాల్లో ప్రస్తావించినవారున్నారు. ఘోష యాత్ర సమయంలోనూ, గోగ్రహణ సమయాన కర్ణుడు పరాజితుడైన మాట వాస్తవమే! అయితే అదే కర్ణుడిపై దుర్యోధనునికి ఎందుకంత నమ్మకం అంటే అస్త్రశస్త్ర రచనలోనూ, గదాయుద్ధంలోనూ ప్రావీణ్యం ఉన్న జరాసంధుని సైతం కర్ణుడు నిలువరించి ఉంటాడు. అందువల్ల దుర్యోధనునికి కర్ణుడంటే అంతటి విశ్వాసం! ఇక తన ప్రాణరక్షితాలైన సహజ కవచకుండలాలను ఇంద్రునికి దానమిచ్చిన సమయంలోనే బలి, శిబి, దధీచి వంటి పుణ్యాత్ముల సరసన చేరాడు కర్ణుడు. ఇవన్నీ కాదు సాక్షాత్తు వేదవ్యాసుడే కర్ణుని గొప్పతనాన్ని వివరిస్తూ 'మహాతేజస్వి, అభిమానవంతుడు, ధార్మికోత్తముడు..' అంటూ (మహాభారతం-ఉద్యోగపర్వం 144-31)లో వర్ణించాడు. ఇలాంటి అంశాలన్నీ నటరత్న ఎన్టీఆర్‌కు తెలియనివి కావు. ప్రధాన పాత్రలోని మంచిచెడ్డలలో మంచినే ఎక్కువగా ప్రదర్శించాలన్న సంప్రదాయాన్ని అనుసరించారు ఎన్టీఆర్. ఆయనే కాదు తరవాత వెలసిన పురాణాల లక్ష్యం కూడా అదే! ఆ అష్టాదశ పురాణాలను సైతం 'మహాభారత' కర్త వేదవ్యాసులవారే అందించారు.

● అదే తీరున రామాయణ, భారత, భాగవతాలను అందులోని పాత్రలను ఆశ్రయించుకొని తరువాతి రోజుల్లో పలు రచనలు వచ్చాయి. ఇక తెలుగులో కవిత్రయం మూలభారతంలోని కొన్ని అంశాలను వదిలివేసిన సందర్భాలూ ఉన్నాయి. ఈ తీరున ఎవరికి వారు తమ స్వేచ్ఛాసృష్టితో ఆ పురాణ పాత్రలకు తమదైన రీతిలో హంగులు అద్దారు. అలా వెలసిన కథనే మనమంతా మహా కళా ఖండమని కీర్తిస్తున్న 'మాయాబజార్'(1957) చిత్ర రాజం!

● తొలి నుంచీ మన పురాణాల లక్ష్యం సామాన్యులలో సత్ప్రవర్తన కలుగజేయడమే! ఎన్టీఆర్ సైతం దానిని అనుసరించారు. తాను తొలిసారి స్వీయ దర్శకత్వంలో నటిస్తూ తెరకెక్కించిన 'సీతారామకళ్యాణం'లో రావణ పాత్రను అదే తీరున చిత్రీకరించారు. పరమశివభక్తుడైన రావణుడు స్త్రీ వ్యామోహంతో పతనమయ్యాడని చాటారు. ఎన్నో సున్నితాంశాలను సైతం నిశితంగా చాటిన ఎన్టీఆర్ పురాణ పరిజ్ఞానాన్ని శంకించడం అనంతమైన అజ్ఞానమే అవుతుంది. 'లవకుశ' చిత్రం ఘనవిజయం తరువాత ఆ సినిమా వెలుగు చూడటానికి కారకులైన సుందర్‌లాల్ నహతా ఎన్టీఆర్‌ను ఓ కోరిక కోరారు. హిందీలో తాను తీసే సినిమాలో శ్రీకృష్ణ పాత్ర ధరిస్తే కోటి రూపాయలు పారితోషికంగా సమర్పించుకుంటానని అన్నారు నహతా. అయినా ఎన్టీఆర్ తన పౌరాణిక పాత్రలు తెలుగు వారికే సొంతం కావాలని ఆశించి, నహతా ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించారు. తన తెలుగు జాతి అంటే ఎన్టీఆర్‌కు అంతటి అభిమానం! అలాగే తెలుగుదేశం పార్టీతో రాజకీయ ప్రవేశం చేసి సృష్టించిన చరిత్ర తెలిసిందే. ప్రజల మదిలో ఆయన నేటికీ కొలువై ఉండడానికి ఆయన పోషించిన పౌరాణిక పాత్రలు, వాటిలో చూపించిన వైవిధ్యం కారణమని చెప్పక తప్పదు. భారతీయులు పవిత్రంగా భావించే దేవతామూర్తుల పాత్రల్లో ఎన్టీఆర్ నటించలేదు, జీవించారు. అందువల్లే ఈ నాటికీ ప్రజల హృదయాల్లో ఎన్టీఆర్ జీవించే ఉన్నారు. అంతటి మహానటుణ్ణి, మహానాయకుణ్ణి కొందరు స్వార్థపరులు రాజకీయం కోసం వేలెత్తి చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే రాజకీయ ప్రయోజనాల కోసం ఉత్తరాదిన ఓ మహా స్వాప్నికుడిని హిందువు కాదంటూ ఛిద్రం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అదే తీరున ఎన్టీఆర్ పేరును కూడా తమ పాలిటిక్స్‌కు ఉపయోగించుకోవాలనుకుంటే ఇక్కడ అటువంటివారి పప్పులు ఉడకవు. ఎందుకంటే తెలుగు నేలతో మమేకమైన - తెలుగు జనతతో పెనవేసుకున్న ఎన్టీఆర్ అనుబంధం అంతటి గాఢమైనది.

- కొమ్మినేని వెంకటేశ్వర రావు

నా రికార్డ్స్ అన్నీ అన్‌స్టాపబుల్

-నందమూరి బాలకృష్ణ



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'డాకు మహారాజ్' చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదలై ఘన విజయం సాధించిన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో విజయోత్సవ సభను చిత్ర బృందం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ 'వరుసగా ఇది నాకు నాలుగో విజయం. నీటి సమస్య గురించి ప్రజలకు అవగాహన కలిగించిన సినిమా డాకు మహారాజ్. ఒక తెలుగు ఇంజనీర్ రాజస్థాన్ వెళ్లి, అక్కడి ప్రజల కోసం డాకుగా మారడం ఈ సినిమాలో చూశారు. ఆదరించి, అఖండమైన విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నన్ను ఎంతగానో ప్రేమించి, నాలో ఉన్న నట విశ్వరూపాన్ని ఆవిష్కరించేలా చేశాడు దర్శకుడు బాబీ. అలాగే మా నిర్మాత వంశీ గారు నా అభిమాని. ఈ సినిమాలో కొత్త బాలకృష్ణను ఆవిష్కరించాలని ఆయన కల కన్నారు. అన్ని క్రాఫ్ట్ మీద మంచి గ్రిప్ ఉన్న వంశీ. నా అభిమాని కావడం నాకు చాలా గర్వంగా ఉంది. మన సినిమాలను చూసి ప్రశంసించే స్థాయికి తెలుగు చలన చిత్రసీమ ఎదిగింది. నా వరకు చూసుకుంటే, నా రికార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా కలెక్షన్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా అవార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా రివార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్ అన్నారు. ఈ నెల 22న అనంతపురంలో విజయోత్సవ పండుగ నిర్వహిస్తామని బాలకృష్ణ చెప్పారు. దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ,' బాలకృష్ణ ఫిల్మోగ్రఫీలో ఒక మాస్టర్ పీస్ సినిమా ఇవ్వడానికి కారణమైన మా టీమ్ అందరికీ థాంక్యూ సో మచ్. బాలకృష్ణ గారు కథను అర్థం చేసుకొని, దర్శకుడు ఏది అడిగితే అది చేస్తారు' అన్నారు. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ, బాలకృష్ణ గారిని కొత్తగా చూపించాలనే ఉద్దేశంతో ఈ సినిమా చేశాము. అభిమానులు, ప్రేక్షకుల నుంచి మేము ఊహించిన దానికంటే పది రెట్లు ఎక్కువ స్పందన లభించింది. జనవరి 12న ఈ సినిమా విడుదలైతే, సంక్రాంతి పండుగ రోజుకే మా డిస్ట్రిబ్యూటర్లు సేఫ్ జోన్‌కి వెళ్లిపోయారు. అది మాకు పెద్ద సక్సెస్.' అన్నారు.

మహేశ్ ట్వీట్ చేయడం ఆనందంగా ఉంది

- వెంకటేశ్



'కష్టపడి పనిచేస్తే ఫలితం వస్తుందని నా నమ్మకం. ఆ నమ్మకాన్ని ఈ విజయం మరోసారి రుజువు చేసింది. ఇది మా విజయం కాదు, తెలుగు ప్రేక్షకులది. ఈ సినిమాను ఇంతటి సూపర్ డూపర్ హిట్ చేసిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నా' అని అన్నారు హీరో వెంకటేశ్. 'సంక్రాంతికి వస్తున్నాం' ఇటీవలె విడుదలై ప్రేక్షకాదరణతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ పొంగల్ బ్లాక్‌బస్టర్ జాతర సెలబ్రేషన్స్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వెంకటేశ్ మాట్లాడుతూ 'చిత్ర పరిశ్రమలోని అనేక మంది ఫోన్ చేసి అభినందిస్తున్నారు. సినిమా చాలా నచ్చిందంటూ చిన్నోడు మహేశ్‌బాబు ట్వీట్ చేయడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'ఈ రోజు నాకు ఎనిమిది సక్సెస్‌లు అంటున్నారు. ప్రేక్షకుల సపోర్ట్ లేకుంటే నాకు ఏ విజయమూ దక్కేది కాదు. ఒక దర్శకుడిగా ప్రేక్షకులకు ఎంతగా రుణపడి ఉండాలో అర్థం కావడం లేదు' అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'ఈ సినిమా మేము ఊహించని మహా అద్భుతం. అనిల్, వెంకటేశ్ కాంబినేషన్‌లో సినిమా అంటే పాజిటివ్ వైబ్రేషన్. ఇది మాకు బ్లాక్ బస్టర్ పొంగల్. ఈ సంక్రాంతిని మర్చిపోలేం' అని అన్నారు. మరో నిర్మాత శిరీష్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ ఆర్ట్స్ హరికి కృతజ్ఞతలు చెప్పాలి. ఈ చిత్రం మా సమస్యలన్నింటినీ తీరుస్తుందని షూటింగ్‌లో చెప్పేవారు. ఆయన మాట నిజమైంది' అని అన్నారు.

పెద్దోడిని అభినందించిన చిన్నోడు

శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సెలబ్రేషన్స్‌కు మహేశ్ హాజరై సందడి చేశారు. వెంకటేశ్‌తో పాటు చిత్రబృందాన్ని అభినందించారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఖేల్‌రత్న పురస్కారాలు అందుకుంటున్న మను భాకర్, ప్రవీణ్ కుమార్, హర్మన్‌ప్రీత్ సింగ్, గుకేష్

కనుల పండుగ.. క్రీడా అవార్డుల వేడుక

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): క్రీడారంగంలో విశేష ప్రతిభ కనబర్చిన ఆటగాళ్లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఘనంగా సత్కరించారు. శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో జాతీయ క్రీడా అవార్డుల వేడుక కన్నుల పండుగగా జరిగింది. ఇందులో భాగంగా అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డును డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ షూటర్ మను భాకర్, వరల్డ్ చెస్ చాంపియన్ గుకేశ్‌లతో పాటు హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారాలింపిక్స్ విజేత ప్రవీణ్ కుమార్ అందుకున్నారు. వీరికి సర్టిఫికెట్, మెడల్‌తో పాటు తలా రూ.25 లక్షల రివార్డు దక్కుతుంది. అలాగే 32 మంది అథ్లెట్లు అర్జున అవార్డును అందుకోగా, ఐదుగురు ద్రోణాచార్య స్వీకరించారు. తెలంగాణకు చెందిన పారా అథ్లెట్ దీప్తి జివాంజితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ జ్యోతి యర్రాజికు అర్జున దక్కింది. దీప్తి అవార్డును స్వీకరించగా, జ్యోతి శిక్షణ నిమిత్తం దక్షిణాఫ్రికాలో ఉండడంతో వేడుకకు హాజరుకాలేకపోయింది. ఈ పురస్కారంతో పాటు రూ.15 లక్షల రివార్డు వీళ్లకు దక్కనుంది.



భావోద్వేగ సన్నివేశం..

అర్జున అవార్డు కోసం దశాబ్దాలుగా ఆయన పోరాటానికి ఫలితం దక్కింది. పారాలింపిక్స్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించిన 80 ఏళ్ల మురళీకాంత్ పేట్కర్ చివరకు అర్జున అవార్డు (లైఫ్ టైమ్) అందుకున్నాడు. అయితే ఈ సందర్భంలో అంతటా భావోద్వేగం చోటుచేసుకుంది. 1965లో పాకిస్థాన్‌తో యుద్ధంలో పేట్కర్‌కు బుల్లెట్ గాయం తగిలి నడుం కింది భాగానికి వైకల్యం ఏర్పడింది. ఆ తర్వాత 1972 పారాలింపిక్స్ స్విమ్మింగ్‌లో అతను స్వర్ణం సాధించాడు. ఆహూతుల హర్షధ్వానాల మధ్య అతను చేతి కర్రల సహాయంతో అవార్డును స్వీకరించేందుకు రాగా, రాష్ట్రపతి ముందుకు వచ్చి పేట్కర్‌ను సత్కరించడం అందరినీ ఆకట్టుకుంది.

షూటర్ ముకేష్‌కు రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): మొహాలీలో జరిగిన అఖిల భారత విశ్వవిద్యాలయాల షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు షూటర్ ముకేష్ రజతంతో మెరిశాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ముకేష్ రెండో స్థానంలో నిలిచాడు.

చెస్ పోటీలు ప్రారంభం

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలో జాతీయస్థాయి పాఠశాల చెస్ చాంపియన్‌షిప్ శుక్రవారం ఘనంగా మొదలైంది. టోర్నీని స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈనెల 21 వరకు ఈ పోటీలు జరుగుతాయి.

చాంపియన్స్ ట్రోఫీకి టీమిండియా ఎంపిక నేడే

ముంబై: చాంపియన్స్ ట్రోఫీతో పాటు ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టును శనివారం ప్రకటించనున్నారు. 15 మందితో కూడిన ఈ ప్రాథమిక జట్టులో సెలెక్షన్ కమిటీ బుమ్రాపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఆసీస్‌తో చివరి టెస్టులో తను గాయపడిన విషయం తెలిసిందే. అలాగే, ఈనెల 22 నుంచి ఇంగ్లండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌కు కూడా జట్టును ప్రకటించనున్నారు.

స్టార్లు సాఫీగా..



సబలెంకా

- ప్రీక్వార్టర్స్‌లో జొకో, అల్కారజ్, సబలెంకా, గాఫ్
- ఏడో సీడ్ పెగులాకు షాక్
- ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో స్టార్ ఆటగాళ్లు అంచనాలను అందుకొంటూ ముందంజ వేస్తున్నారు. పురుషుల్లో..11వ టైటిల్‌పై కన్నేసిన దిగ్గజం నొవాక్ జొకోవిచ్, నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల విజేత కార్లోస్ అల్కారజ్, రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరేవ్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. మహిళల విభాగంలో డిఫెండింగ్ చాంప్ అర్యానా సబలెంకా, మూడో సీడ్ కొకొ గాఫ్ నాలుగో రౌండ్‌లో ప్రవేశించారు. అయితే మెల్‌బోర్న్ పార్క్‌లో రెండు సార్లు విజేతగా నిలిచిన నవోమి ఒసాకా గాయంతో మూడో రౌండ్ నుంచి అర్ధంతరంగా వైదొలగింది. ఏడో సీడ్ జెస్సికా పెగులాకు అన్‌సీడెడ్ సెర్బియా క్రీడాకారిణి ఓల్గా డానిలోవిచ్ షాకిచ్చింది. గత ఏడాది సెమీఫైనలిస్ట్ గాఫ్ 6-4, 6-2తో 2021 యూఎస్ ఓపెన్ రన్నరప్ లెలా ఫెర్నాండెజ్‌ని చిత్తు చేసింది. టాప్ సీడ్ సబలెంకా కూడా 7-6 (5), 6-4తో క్లారా టాసన్‌పై గెలిచింది. ఇతర మూడో రౌండ్ మ్యాచ్‌లలో 11వ సీడ్ పొలా బడోసా 6-4, 4-6, 6-3తో 17వ సీడ్ కోస్త్యుక్‌ని, 14వ సీడ్ ఆండ్రీవా 6-2, 1-6, 6-2తో 23వ సీడ్ ఫ్రెచ్‌ని, 27వ సీడ్ పల్యుచెన్కోవా 6-1, 6-2తో సీగ్మండ్‌ని ఓడించి ప్రీక్వార్టర్స్‌కు చేరారు. 23 ఏళ్ల ఓల్గా డానిలోవిచ్ 7-6 (3), 6-1తో ఏడో సీడ్, యూఎస్ ఓపెన్ రన్నరప్ పెగులాపై సంచలన విజయం సాధించింది. 12వ సీడ్ ష్నీడెర్‌కు 7-6 (4), 6-7 (7), 7-5తో 18వ సీడ్ వెకిక్ షాకిచ్చింది. మరోవైపు నవోమి ఒసాకా 6-7 (7)తో టోక్యో ఒలింపిక్స్ చాంపియన్ బెలిండా బెన్సిక్‌తో తొలి సెట్‌ను కోల్పోయిన దశలో పొత్తి కడుపు నొప్పితో మ్యాచ్ నుంచి నిష్క్రమించింది. పురుషుల మూడో రౌండ్‌లో ఏడో సీడ్ జొకోవిచ్ 6-1, 6-4, 6-4తో టోమస్ మకాక్‌పై వరుస సెట్లలో విజయం సాధించాడు. అయితే రెండో సెట్‌లో జొకో శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందిపడ్డాడు. ఆపై చికిత్స తీసుకొని మ్యాచ్‌ను కొనసాగించాడు. రెండో సీడ్ జ్వెరేవ్ 6-3, 6-4, 6-4తో ఫెర్న్‌లీపై, మూడో సీడ్ అల్కారజ్ 6-2, 6-4, 6-7 (7), 6-2తో బోర్గెస్‌పై, 12వ సీడ్ టామీ పాల్ 7-6 (0), 6-2, 6-0తో కార్బలెస్‌పై విజయంతో నాలుగో రౌండ్‌కు చేరారు.

మిక్స్‌డ్‌లో బోపన్న జోడీ బోణీ

పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన భారత వెటరన్ రోహన్ బోపన్న మిక్స్‌డ్‌లో బోణీ చేశాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో బోపన్న/షుయ్ జాంగ్ (చైనా) ద్వయం 6-4, 6-4తో డోడిగ్/క్రిస్టియానాపై నెగ్గి రెండోరౌండ్ చేరింది.

అమ్మాయిలూ.. అదరగొట్టాలి

- డిఫెండింగ్ చాంపియన్‌గా భారత్
- తొలి రోజే ఆరు మ్యాచ్‌లు
- రేపు విండీస్‌తో యువ భారత్ పోరు

నేటి నుంచి అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్

ఉదయం 8 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



కౌలాలంపూర్: భారత కొత్తతరం మహిళా క్రికెటర్లు అంతర్జాతీయ వేదికపై మరోసారి సత్తా నిరూపించుకోవాలనుకుంటున్నారు. శనివారం నుంచి మలేసియాలో అండర్-19 టీ20 వరల్డ్‌కప్ ఆరంభం కాబోతోంది. 2023లో దక్షిణాఫ్రికాలో జరిగిన తొలి మెగా టోర్నీలో షఫాలీ వర్మ నేతృత్వంలోని భారత జట్టు విజేతగా నిలిచింది. ఈసారి నికీ ప్రసాద్ కెప్టెన్సీలో టీమ్ చెలరేగి రెండో టీ20 వరల్డ్‌కప్‌ను సైతం ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. ఈ టోర్నీలో మొత్తం 16 జట్లు పాల్గొంటుండగా, వీటిని నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతీ గ్రూప్ నుంచి టాప్-3 జట్లు సూపర్ సిక్స్ దశకు వెళతాయి. ఆ తర్వాత రెండు సూపర్ సిక్స్ గ్రూపుల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్‌లో తలపడతాయి. ఫిబ్రవరి 2న ఫైనల్ జరుగుతుంది. ఇక భారత జట్టు గ్రూప్ 'ఎ'లో ఉండగా శ్రీలంక, వెస్టిండీస్, మలేసియా ఇతర జట్లు. ఆదివారం విండీస్‌తో జరిగే పోరుతో భారత్ తమ టైటిల్ వేట ఆరంభిస్తుంది. అయితే శనివారం జరిగే టోర్నీ ప్రారంభ మ్యాచ్‌ల్లో ఆసీస్-స్కాట్లాండ్, ఇంగ్లండ్-ఐర్లాండ్, సమోవా-నైజీరియా, బంగ్లాదేశ్-నేపాల్, పాకిస్థాన్-యూఎస్ఏ, న్యూజిలాండ్-దక్షిణాఫ్రికా జట్లు తలపడతాయి.

భారత్ షెడ్యూల్

జనవరి 19	వెస్టిండీస్‌తో
జనవరి 21	మలేసియాతో
జనవరి 23	శ్రీలంకతో

మ్యాచ్‌లన్నీ మధ్యాహ్నం 12 గం. నుంచి

త్రిష మరోసారి..



గత నెలలో జరిగిన అండర్-19 ఆసియాకప్‌లో హైదరాబాదీ జి.త్రిష విశేషంగా రాణించింది. దీంతో ఆమె వరుసగా రెండోసారి ఈ మెగా టోర్నీలో చోటు దక్కించుకుంది. టాపార్డర్‌లో త్రిష దూకుడు జట్టుకు ఉపయోగపడగలదు. అలాగే స్పిన్ విభాగంలో పరునిక సిసోడియా, సోనమ్ యాదవ్, ఆయుషి శుక్లా కీలకం కానున్నారు. జట్టులో మరో ఇద్దరు తెలుగమ్మాయిలు కేసరి ధ్రుతి, షబ్నమ్‌లకు కూడా చోటు దక్కడం విశేషం.

భారత మహిళల జట్టు: నికీ ప్రసాద్ (కెప్టెన్), సానికా చాల్కే, త్రిష, కమలిని, భవిక, ఈశ్వరి, మిథిల, జోషిత, సోనమ్ యాదవ్, పరునిక, కేసరి ధ్రుతి, ఆయుషి, ఆనందిత, షబ్నమ్, వైష్ణవి.

సింధుకు చుక్కెదురు

- సెమీస్‌కు సాత్విక్ జోడీ
- ఇండియా ఓపెన్



న్యూఢిల్లీ: సొంతగడ్డపై టైటిల్‌తో సత్తా చాటాలనుకున్న స్టార్ షట్లర్ పీవీ సింధుకు చుక్కెదురైంది. ఇండియా ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్లోనే వెనుదిరిగింది. కాగా, పురుషుల డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి టోర్నీలో భారత్ ఆశలను సజీవంగా ఉంచింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ పోరులో మాజీ చాంపియన్ సింధు 9-21, 21-19, 17-21తో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత గ్రెగోరియా మరిస్కా (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలైంది. 2017లో ఇండియా ఓపెన్ టైటిల్ నెగ్గిన సింధు.. ఆ మరుసటి ఏడాది రన్నరప్‌గా నిలిచింది. కాగా, పురుషుల సింగిల్స్ బరిలో మిగిలిన ఏకైక ఆటగాడు కిరణ్ జార్జ్ 13-21, 19-21తో చైనా షట్లర్ వెంగ్ హాంగ్‌యాంగ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ ద్వయం 21-10, 21-17తో కొరియా జోడీ కాంగ్ మిన్ హ్యుక్/హో జిన్‌ను చిత్తుచేసి సెమీస్ చేరింది. ఫైనల్ బెర్త్ కోసం మలేసియా జంట గో జె ఫె/ఇజుద్దీన్ కాన్‌తో సాత్విక్ ద్వయం తలపడనుంది.



సీఎం చంద్రబాబును కలిసిన హంపి

అమరావతి (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్ సాధించిన తెలుగు గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ఈ సందర్భంగా హంపిని చంద్రబాబు అభినందించారు. తెలుగు రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన హంపి.. భవిష్యత్‌లో మరిన్ని టైటిళ్లు గెలవాలని సీఎం ఆకాంక్షించారు. హంపి వెంట ఆమె కుటుంబసభ్యులు కూడా ఉన్నారు.

విజయ్ హజారే టోర్నీ ఫైనల్ నేడు | కర్ణాటక X విదర్భ మ. 1.30 నుంచి

'ఆటో' పెట్టుబడుల కేంద్రంగా భారత్

నాలుగేళ్లలో వాహన రంగంలోకి రూ.3.09 లక్షల కోట్ల ఎఫ్‌డీఐ

ఏడాదిలో 2.5 కోట్ల వాహనాల విక్రయం.. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ప్రధాని



న్యూఢిల్లీ: మొబిలిటీ రంగం భవిష్యత్తు భారత్‌దేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో గత ఏడాది రికార్డు స్థాయిలో రెండున్నర కోట్ల వాహనాలు అమ్ముడుపోయాయని, అనేక దేశాల జనాభా కన్నా మన దేశంలో కార్ల అమ్మకాలు అధికమని చెప్పారు. కేవలం నాలుగేళ్ల కాలంలో మొబిలిటీ రంగంలోకి 3,600 కోట్ల డాలర్ల (రూ.3.09 లక్షల కోట్లు) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చాయని చెప్పారు. ఐదు రోజుల పాటు జరిగే భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025 ప్రదర్శనను ఢిల్లీలోని భారత మండపంలో శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. మొబిలిటీ (ఆటోమొబైల్) రంగంలో తన భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలనుకునే ప్రతి ఇన్వెస్టర్‌కు భారత్ అద్భుతమైన గమ్యమన్నారు. ఆటోమోటివ్ పరిశ్రమకు ఇన్నోవేషన్, టెక్నాలజీలే చోదకమని పేర్కొంటూ "ప్రపంచం కోసం దేశంలో తయారుచేయండి" అనే మంత్రంతో ముందడుగేసే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పూర్తి మద్దతు, ప్రోత్సాహం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. "మేక్ ఇన్ ఇండియా" మంత్రం ఆటోమొబైల్ రంగం వృద్ధికి ఎంతో దోహదపడిందని చెప్పారు. పీఎల్ఐ పథకాలు ఈ ప్రచారానికి కొత్త ఉత్తేజం కల్పించడంతో పాటు రూ.2.25 లక్షల కోట్ల విక్రయాలు, 1.5 లక్షల ప్రత్యక్ష ఉపాధి అవకాశాలకు బాట వేశాయని తెలిపారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థ, మూడో పెద్ద ప్రయాణికుల వాహన మార్కెట్‌గా ఉందన్నారు. అధిక సంఖ్యలో ఉన్న యువ జనాభా, పెరుగుతున్న మధ్యతరగతి జీవులు, వేగవంతమైన నగరీకరణ, ఆధునిక మౌలిక వసతుల అభివృద్ధి, అందుబాటులోకి వస్తున్న అఫర్డబుల్ వాహనాలు మొబిలిటీ మార్కెట్‌కు బలమని ఆయన అన్నారు.

వేగంగా విస్తరిస్తున్న ఈవీ మార్కెట్

దేశంలో విద్యుత్ వాహనాల (ఈవీ) మార్కెట్ వేగవంతమైన వృద్ధిని నమోదు చేస్తోందని ప్రధాని చెప్పారు. గత దశాబ్ది కాలంలో ఈవీ విక్రయాలు 640 రెట్లు పెరిగాయన్నారు. 10ఏళ్ల క్రితం ఏడాదికి 2,600 ఈవీలు అమ్ముడుపోగా గత ఏడాది ఆ సంఖ్య 16.8 లక్షలకు చేరిందన్నారు. ఈ దశాబ్ది చివరి నాటికి ఈ సంఖ్య 8 రెట్లు పెరగవచ్చని అంచనా వేశారు.

రతన్ టాటా, ఒసాము సుజుకీలకు నివాళి

ఆటోమొబైల్ దిగ్గజాలైన రతన్ టాటా, ఒసాము సుజుకీలను ప్రధాని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. భారత ఆటోమొబైల్ వృద్ధికి, మధ్య తరగతి ప్రజల కలల సాకారానికి వారిద్దరి సేవలు చిరస్మరణీయమన్నారు. మొత్తం భారత మొబిలిటీ రంగానికి వారిద్దరి వారసత్వం ఎల్లప్పుడూ స్ఫూర్తిని అందిస్తుందని నివాళి ఘటించారు.

మెర్సిడెస్ బెంజ్ రెండు కొత్త కార్లు



మెర్సిడెస్ బెంజ్ సరికొత్త బ్యాటరీ విద్యుత్ కారు (బీఈవీ) ఈక్యూఎస్ మేబాక్ ఎస్‌యూవీ 680 "నైట్ సీరీస్"ను విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.2.63 కోట్లు. దీనితో పాటు మెర్సిడెస్ మేబాక్ జీఎల్ఎస్ 600 నైట్ సీరీస్ కారు కూడా విడుదల చేసింది. ఈ కారు ఎక్స్‌షోరూమ్ ధర రూ.3.71 కోట్లు. ఇవి కాకుండా కొత్తగా డెవలప్ చేసిన కాన్సెప్ట్ సీఏల్ఏ కారును ఆవిష్కరించింది.



జేఎస్‌డబ్ల్యూ ఎంజీ సైబర్‌స్టర్

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ రెండు కొత్త ఈవీ మోడళ్లను ఆవిష్కరించింది. ఇందులో ఎంజీ సైబర్‌స్టర్ కారు దేశంలోని తొలి ఆల్ ఎలక్ట్రిక్ రోడ్‌స్టర్ కారు. రెండోది ఎంజీ ఎం9. ఇది మూడు వరుసలున్న తొలి విద్యుత్ లిమోసిన్ కారు. ఈ రెండు కార్లను ఈ ఏడాదే మార్కెట్లో విడుదల చేస్తారు. ఈ కార్లతో తాము యాక్సెసిబుల్ లగ్జరీ విభాగంలోకి ప్రవేశించినట్టు కంపెనీ ప్రకటించింది.

బీఎండబ్ల్యూ ఇండియా ఈవీ



జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల దిగ్గజం బీఎండబ్ల్యూ పూర్తిగా స్థానికంగా తయారు చేసిన బీఎండబ్ల్యూ ఎక్స్ 1 లాంగ్ వీల్ బేస్ ఈవీని విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.49 లక్షలు. దీన్ని చెన్నై ప్లాంట్‌లో ఉత్పత్తి చేశారు. బీఎండబ్ల్యూ నుంచి పూర్తిగా దేశీయంగా తయారైన తొలి ఈవీ ఇది.



పోర్షే కొత్త విద్యుత్ ఎస్‌యూవీ

జర్మనీకి చెందిన లగ్జరీ స్పోర్ట్స్ కార్ల కంపెనీ పోర్షే సరికొత్త విద్యుత్ ఎస్‌యూవీ మకాన్, సరికొత్త హంగులతో తీర్చిదిద్దిన స్పోర్ట్ సెలూన్ టైకాన్‌ను భారత మార్కెట్లో విడుదల చేసింది. మకాన్ బీఈవీ మూడు మోడళ్లలో అందుబాటులో ఉంటుంది. ధర రూ.1.22 కోట్ల నుంచి రూ.1.69 కోట్ల మధ్యన ఉంటుంది. కొత్త హంగులతో విడుదల చేసిన టైకాన్ ధర రూ.1.89 కోట్ల నుంచి రూ.2.53 కోట్ల మధ్యన ఉంటుంది.

సుజుకీ తొలి విద్యుత్ స్కూటర్



సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తొలి విద్యుత్ స్కూటర్ ఈ-యాక్సెస్‌ను, మరో రెండు కొత్త మోడళ్లను విడుదల చేసింది. ఈ యాక్సెస్ 3.07 కిలోవాట్ల లిథియం ఐరన్ ఫాస్ఫేట్ బ్యాటరీతో వస్తుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 95 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఇతర మోడళ్లలో జిక్సర్ ఎస్ఎఫ్ ఫ్లెక్స్ ఫ్యుయెల్ బైక్, పూర్తిగా కొత్తగా తయారుచేసిన యాక్సెస్ 125 సీసీ స్కూటర్ ఉన్నాయి.



హీరో మోటోకార్ప్

టూవీలర్ దిగ్గజం హీరో మోటోకార్ప్ నాలుగు కొత్త వాహనాలను ప్రదర్శించింది. ఎక్స్‌ట్రీమ్ 250 ఆర్ ద్వారా 250 సీసీ వాహనాల విభాగంలోకి తొలిసారిగా ప్రవేశించింది. అలాగే ఎక్స్‌పల్స్ 210 బైక్, జూమ్ 125, జూమ్ 160 స్కూటర్లు కూడా ప్రదర్శించిన వాహనాల్లో ఉన్నాయి. ఈ వాహనాలన్నింటి బుకింగ్స్ ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయి. మార్చి నుంచి వాహనాల డెలివరీ ప్రారంభిస్తారు.

బిజినెస్

విప్రో లాభంలో 24 శాతం వృద్ధి

క్యూ3లో రూ.3,354 కోట్లుగా నమోదు

ఒక్కో షేరుకు రూ.6 మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) విప్రో ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 24.4 శాతం వృద్ధితో రూ.3,354 కోట్లకు చేరుకుంది. సమీక్షా కాలానికి కంపెనీ ఆదాయం కేవలం 0.5 శాతం పెరిగి రూ.22,319 కోట్లుగా నమోదైంది. ఈ మార్చితో ముగియనున్న నాలుగో త్రైమాసికం(క్యూ4)లో ఐటీ సేవల ద్వారా సమకూరే ఆదాయం 260.2-265.5 కోట్ల డాలర్ల స్థాయిలో ఉండవచ్చని విప్రో అంచనా వేసింది. క్యూ3తో పోలిస్తే క్యూ4లో ఐటీ సేవల ఆదాయ వృద్ధి మైనస్ 1 శాతం నుంచి ఒక శాతం శ్రేణిలో ఉండవచ్చని అంచనా. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరు కు రూ.6 మధ్యంతర డివిడెండ్ చెల్లించనుంది.

12,000 నియామకాలు

వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్రాంగణ నియామకాల (క్యాంపస్ హైరింగ్) ద్వారా 10,000-12,000 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకోనున్నట్లు విప్రో వెల్లడించింది. కాగా డిసెంబరు త్రైమాసికంలో ఉద్యోగుల సంఖ్య 1,157 తగ్గి 2,32,732కు పరిమితమైంది.

కస్టమర్లకు కాల్ చేసేందుకు '1600xx' సిరీస్‌నే ఉపయోగించండి

బ్యాంకులను కోరిన ఆర్‌బీఐ

ముంబై: బ్యాంకింగ్ రంగంలో పెరుగుతున్న ఆర్థిక మోసాలను నిరోధించేందుకు ఆర్‌బీఐ మరో నిర్ణయం తీసుకుంది. వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌ల ద్వారా జరుగుతున్న ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు లావాదేవీల విషయమై ఖాతాదారులకు కాల్ చేసేందుకు '1600XX' సిరీస్ నంబర్లను మాత్రమే ఉపయోగించాలని బ్యాంకులను ఆర్‌బీఐ కోరింది. అలాగే, ప్రచార అవసరాల కోసం '140XX' సిరీస్ నంబర్లను మాత్రమే వినియోగించాలని నిర్దేశించింది. అంతేకాదు, బ్యాంకులు, ఇతర నియంత్రిత సంస్థలు తమ కస్టమర్ల డేటాబేస్‌ను పర్యవేక్షించడంతో పాటు ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేస్తుండాలని సూచించింది. మార్చి31 నాటికి ఈ ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేసింది.

అకౌంట్లు, లాకర్లకు నామినీలుండాల్సిందే: మరణించిన ఖాతాదారు కుటుంబ సభ్యులు లేదా సంబంధీకులకు క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ను వేగవంతం చేసేందుకు అన్ని ఖాతాలు, లాకర్లకు నామినీ వివరాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్త పడాలని బ్యాంకులకు ఆర్‌బీఐ సూచించింది. ప్రస్తుత, కొత్త డిపాజిట్ అకౌంట్లు, సేఫ్టీ లాకర్లకు నామినీలను నిర్ధారించాలని కోరింది.

మారుతి ఈ-విటారా



దేశీయ కార్ల దిగ్గజం మారుతి సుజుకీ తొలి బ్యాటరీ విద్యుత్ కారు ఈ-విటారాను ఆవిష్కరించింది. ఈ కారు 49 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 500 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. దీన్ని భారత్‌లోనే ఉత్పత్తి చేసి 100 దేశాలకు ఎగుమతి చేయనున్నట్టు ప్రకటించింది. ఈ మోడల్‌కు భారత్‌ను ప్రపంచ ఉత్పత్తి కేంద్రంగా చేయాలనుకుంటున్నట్టు కంపెనీ డైరెక్టర్, ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ తెలిపారు.

మూడు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో మూడు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. ఐటీ, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ షేర్లలో అమ్మకాల కారణంగా ప్రామాణిక సూచీలు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, గరిష్ఠ స్థాయి ముడిచమురు ధరలు సైతం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయి. సెన్సెక్స్ ఒక దశలో 780 పాయింట్ల మేర పతనమైనప్పటికీ, మళ్లీ కాస్త కోలుకుంది. చివరికి సూచీ 423.49 పాయింట్ల నష్టంతో 76,619.33 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 108.60 పాయింట్లు కోల్పోయి 23,203.20 వద్ద క్లోజైంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	131
వరంగల్	112	గుంటూరు	130
కరీంనగర్	112	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	104
కర్నూలు	112	నెల్లూరు	109
విశాఖపట్నం	127	అనంతపురం	109
గోదావరి	131		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	475	విజయవాడ	500
వరంగల్	477	గోదావరి	495
చిత్తూరు	503	విశాఖపట్నం	500
		దజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	81,270 ▲	74,500 ▲	1,04,000 ▲
విజయవాడ	81,820 ▲	77,000 ▲	93,500 ▲
విశాఖపట్నం	79,290 ▲	72,680 ▲	91,760 ▼
రాజమండ్రి	84,270 ▲	74,500 ▲	91,700 ▲
ప్రొద్దుటూరు	80,350 ▲	74,400 ▲	93,500 ▼
ముంబై	79,239 ▲	72,583 ▲	90,820 ▼

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd.Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 1/1 & 1/2, Near Indus High School,Gooty Road, Pandipadu Grama Panchayati, Kurnool - 518 002 , Editor : N.Rahul Kumar,
Phone No: 233939, RNI No: APTEL/2004/11739, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad

విచ్చలవిడిగా మాంసం విక్రయాలు

చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు

కర్నూలు న్యూసిటీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థకు సంబంధించిన దుకాణాలలో విచ్చలవిడిగా మాంసం విక్ర యాలు కొనసాగిస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికా రుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపి స్తున్నారు. మద్దూర్ నగర్‌లోని నగర పాలక సంస్థకు సంబంధించి 25 దుకాణాలు ఉన్నాయి. ఇందులో రెండు దుకాణాలలో మాంసం విక్రయాలు చేస్తున్నారు. ఇదంతా తెలిసిన కూడా అధికారులు చోద్యం చూస్తున్నారు. అంతేకాకుం డా ప్రధాన రహదారిలో 15 అడు గుల రోడ్డుని ఆక్రమించుకుని విక్ర యాలు చేస్తున్న రెవెన్యూ, పట్టణ ప్రణాళికా, ఆరోగ్య విభాగం అధికా రులు ఎందుకు పట్టించుకోవడం లేదని కొందరు ప్రశ్నిస్తున్నారు.

● **అద్దె దోపిడీ..సబ్ లీజ్‌కు దుకాణాలు**

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 2023 నవంబరులో 25 దుకాణాలకు టెండరు పిలిచారు. అయితే ఒక్కో దుకాణానికి రూ.15 వేల చొప్పున అద్దె వసూలు చేయాలని నిర్ణయించారు. అయితే కొం దరు యజ మానులు దుకాణాలను దక్కించుకుని ఇతరులకు రూ.30 నుంచి రూ.40 వేల చొప్పున లీజుకు ఇచ్చారు. మొత్తం 25 దుకాణాలలో సగం దుకాణాలకు లీజుదారులే నిర్వస్తుండటం గమనార్హం.

● **ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు**

మద్దూర్ నగర్ ప్రధాన రహదారి పక్కనే ఈ దుకాణాలు ఉన్నా యి. అయితే రెండు దుకాణా లలో మాంసం విక్రయాలు జరుగు తుండటంతో ఆదివారం, మంగళవారాలు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. మాం సం దుకాణాదారులు షాపు నుంచి ఏకంగా 15 అడుగుల రోడ్డుని ఆక్రమించుకుని విక్రయాలు చేస్తున్నారు. అంతేకాకుండా ఈ రెండు దుకాణాలు లీజుకు తీసుకున్నారు. ఒక్కో దుకాణాన్ని యజమాని రూ.40 వేలకు అద్దెకు ఇచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు.

● **అధికారులు ఉదాసీనత**

అధికారులు ఉదాసీనత కారణంతో మాంసం దుకాణదారులు విచ్చలవిడిగా దుకాణాలలో విక్రయాలు చేస్తున్నారు. అయితే మూడు విభాగాలకు సంబంధించి అధికారు లకు ముడుపులు వస్తున్నాయని కొందరు ఆరోపిస్తున్నారు. లేదంటే ప్రధాన రహదారిపై ఉన్న దుకాణా లలో మాంసం విక్రయాలు చేస్తుండటంతోపాటు రోడ్డుని ఆక్రమించు కోవడం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. నగర పాలక అధికారులు టెం డరు అనంతరం దుకాణ నియామక పత్రాలు ఇచ్చే సమయంలో స్పష్టం గా నగర పాలక దుకాణాలలో మాంసం, మద్యం విక్రయాలు నిషేధిం చారు. అయితే నిబంధనలు అతిక్రమించి దుకాణదారులు మాంసం విక్ర యాలు చేయడం శోచనీయం. ఈ విషయంపై అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



నగర పాలక సంస్థకు సంబంధించిన మాంసం దుకాణం

విచారణ చేయిస్తాం



నగర పాలక సంస్థ అధికారులను పంపించి విచారణ చేయిస్తాం. విచారణలో నిజమని తేలితే తక్షణమే దుకాణాలను సీజ్ చేయిస్తాం. నిబంధనల ప్రకారం నగర పాలకకు సంబంధించిన దుకా ణాలలో మాంసం, మద్యం విక్రయాలు చేయరాదు. నిబంధనలు అతిక్ర మించిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఎవ్వరైనా సబ్ లీజుకు ఇచ్చిన వారిని కూడా విచారిస్తాం.

- ఆర్‌జీవీ కృష్ణ, అడిషనల్ కమిషనర్

కబ్జాలపై సర్వే వివరాలు ఇవ్వాలి

కుడా చైర్మన్‌కు పీపీఎస్ఎస్ నాయకుల వినతి



సోమిశెట్టికి వినతి పత్రం ఇస్తున్న పీపీఎస్ఎస్ నాయకులు

కర్నూలు న్యూసిటీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కబ్జాకు గురైన వందల కోట్ల ప్రభుత్వ భూముల సర్వే వివరాలను ప్రజలకు తెలియపరచాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి అన్నారు. శుక్రవారం కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ గార్గేయపురం చెరువు మీదుగా నగర వనం వెళ్లేందుకు గతంలో టీజీ వెంకటేష్ మంత్రిగా ఉన్న సమయంలో సిమెంట్ రోడ్డు వేయిం చార న్నారు. అయితే ఆ ప్రాంతంలో ఉన్న రియల్టర్ రోడ్డును కూడా ఆక్ర మించారని ఆరోపించారు. బి.తాండ్రపాడు, గార్గేయపురం చెరు వులు, వాగులు, వంకలను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవా లని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.నాగ రాజు, ఎస్.రమణగౌడు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

కర్నూలు అర్బన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్య మంత్రి దివంగత ఎన్టీఆర్ 29వ వర్ధంతిని శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తిక్కారెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, రాష్ట్ర, జిల్లా స్థాయిలో పార్టీ లో వివిధ హోదాల్లో కొనసాగుతున్న నాయకులకు, అభిమానులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. నందమూరి తారక రామా రావు 9 నెలల కాలంలో అధికారంలోకి వచ్చి వివిధ వర్గాల వారిని రాజకీయంగా ప్రోత్సహించి వారికి అత్యున్నత స్థాయికి తీసు కొని వచ్చిన మహానేత అని కొనియాడారు. అన్నదాన కార్యక్రమాలు, రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయాలన్నారు. ఎన్టీఆర్, బాలక్రిష్ణ అభిమానులు కూడా కార్యక్రమాల్లో పాల్గొని ఐక్యత చాటా లని పిలుపునిచ్చారు.

ప్యాకేజీ ప్రకటించడం అభినందనీయం



నంద్యాల నాగేంద్ర

కర్నూలు అర్బన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వ రూ. 11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడం అభినందనీయమని ఆర్యవైశ్య కార్పొ రేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడు తూ విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించి మళ్లీ ఊపిరి పోసిందన్నారు. 1999లో అప్పటి ప్రధాని వాజ్‌పేయ్ ప్రభుత్వాన్ని ఒప్పించి విశాఖ స్టీల్‌కు ఆర్థిక ప్యాకేజీ తెచ్చి ఊపిరి పోసిన చంద్ర బాబు నేడు మళ్లీ ప్రధాన మోదీకి ఆంధ్రుల సెంటిమెంట్ వివరించి, ప్రైవేటీకరణ ఆపించి, ఆర్థిక ప్యాకేజీ వచ్చేలా కృషి చేశారని తెలి పారు. గత ఐదేళ్లలో నాటి వైసీపీ ప్రభుత్వం కుట్ర చేదించి, ప్రజల భాగస్వామ్యంతో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా ఉద్యమాలు చేసింది తెలుగుదేశం పార్టీని తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల్లోనే నిర్వహించాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సొమ్ము తో నిర్వహించే ఏ కార్యక్రమమైనా ప్రభుత్వ కార్యాలయాల్లోనే నిర్వ హించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. శుక్ర వారం కార్యాయలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నగేష్ మాట్లా డుతూ ప్యారా స్పోర్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల క్రీడల పోస్టర్లను టీడీపీ కార్యాయలంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటే శ్వర్లు ఆవి ష్కరించడాన్ని డీవైఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు రాఘవేంద్ర పాల్గొన్నారు.

రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

గూడూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. శుక్రవా రం గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో రీ సర్వేపై ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన చనుగొండ్ల గ్రామంలో రీ సర్వేపై గ్రామ సభను నిర్వహిస్తామన్నారు. చనుగొండ్ల గ్రామంలో దాదాపు ఏడు వేల ఎకరాలు భూమి ఉందని, 90 రోజుల్లో రీ సర్వేను పూర్తి చేయాలని అన్నారు. ఇందుకోసం 3 టీంలను నియమించామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ రెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ లోకేశ్వర రెడ్డి, సర్వేయర్ బాలు నాయక్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.


కాల్వబుగ్గ హుండీ ఆదాయం రూ.6.48 లక్షలు



హుండీ నగదు లెక్కిస్తున్న భక్తులు

ఓర్వకల్లు జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఈవో మద్దిలేటి, దేవదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ రమేష్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. 11 నెలల హుండీ లెక్కింపు రూ.6,48,815 లక్షల ఆదాయం సమకూ రింది. అలాగే నిత్యాన్నదానం హుండీ లెక్కింపు రూ.6,006 వచ్చినట్లు ఈవో మద్దిలేటి తెలిపారు. కార్యక్రమంలో భక్తులు కాటిసేని నారాయణ, గువ్వ రవికుమార్, కేవీ మధు, కాకి దేవేంద్ర, వడ్డె నారా యణ, బజారు, జయకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

ఆర్జేడీకి ఎస్టీయూ నాయకుల వినతి



ఆర్జేడీకి వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కడప ఆర్జేడీ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సామేల్‌ను ఎస్టీ యూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి, మాజీ ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మన్న కలిసి వినతిపత్రం అందజేశారు. అపరిష్కృతంగా ఉన్న విద్య, ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. జీవో నెంబరు 117ను రద్దు చేసేందుకు ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వు లను స్వాగతిస్తున్నామని, అన్ని బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి సమర్పిం చిన వారిలో ఎస్టీయు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి పి.నాగేంద్రప్ప ఉన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతి ప్రదానం



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న అతిథులు

కర్నూలు న్యూసిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా నగరంలోని బాలాజీ నగర్ గణపతి గ్రౌండ్‌లో నిర్వాహకుడు రాజాగౌడు ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి ప్రారంభమైన క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిసాయి. ఫైనల్ మ్యాచ్‌లో బాలాజీనగర్ ఫ్రెండ్స్ టీమ్-11 మొదటి విజేతగా నిలిచింది. విజేతకు రూ.20వేలు నగదు బహుమతిని ట్రోఫీని ప్రముఖ బిల్డర్ కే.చంద్రశేఖర్ స్పాన్సర్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. రెండో విజేతగా ఏబీ-17 నిలిచింది. వీరికి శివచరణ్ సింగ్ రూ.15వేల నగదు రన్నర్ ట్రోఫీని స్పాన్సర్ బిర్రు ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. మూడో విజేతగా మహి సూపర్-11 అశు రూ. 10వేల నగదును, స్పానర్ చేయగా.. వారికి అవోపా రాష్ట్ర నాయకులు గోనూరు యుగంధర్ శెట్టి కప్పును అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ఏబీ-17 టీమ్ ప్లేయర్ వెంకటను బ్యయ్యకు ఫ్లైట్ రెస్టారెంట్ అధినేత సలీం రూ.5వేల నగదును, స్పాన్సర్ కొట్టం బాలకృష్ణారెడ్డి చేతులమీదుగా అందజేశారు. బెస్ క్యాచ్ అవార్డును గడ్డ వారియర్స్ టీం ప్లేయర్ ఆప్పును కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు స్పాన్సర్ చేయ గా.. బహుమతి భజరంగదళ్ రాష్ట్ర అధ్యక్షుడు తుంకుంటరెడ్డి అందజేశారు. గేమ్ చేంజర్ బహుమతిని ఫ్రెండ్స్-11 టీం బుల్లెట్ రసూల్‌కు రూ.2వేలు నగదును సీఐ శ్రీదర్, స్పాన్సర్ డా.షంషుద్దీన్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వహకులు కేఈ లవన్ గౌడు, రాజేష్, ఉమేష్, శ్రీను, కిరణ్, దినకర్, శామ్యూల్, గణేష్, సునీల్, నారాయణ్, స్వామి, అప్పు మనో హర్, దావీదు, శ్యాం, అబ్దుల్లా అమన్, శరత్, సాహంబాషా, విజయ్, అబ్దుల్లా తిమ్మి, అనిల్ గౌడు, నరి, చరణ్, వీరేష్, డిష్ నగేష్, మాజీ ఉప సర్పంచ్ నాగన్న, డిష్ మద్దిలేటి, శేఖర్ గౌడు, ప్రవీణ్, తాహేర్, అబ్రార్, ఏసేపు, అబ్రహం, క్రిష్టప్ప గౌడు, బాలస్వామి, అమీర్, మిన్నెల పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీఆర్వోగా వెంకటేశ్వర్లు



కర్నూలు కలెక్టరేట్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి డీఆర్వోగా వెంకటేశ్వర్లు నియమితుల య్యారు. ఈయన ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా, ఇన్‌చార్జి బీసీ సంక్షేమ అధికారిగా పని చేస్తున్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయ ణమ్మ శుక్రవారం నుంచి ఈ నెల 30 వరకు సెలవులో వెళ్లారు. ఫిబ్రవరి 1వ తేదీన తిరిగి విధులకు హాజరు కానున్నారు. ఈ మేరకు ఇన్‌చార్జి డీఆర్వోగా వెంకటేశ్వర్లును నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

స్వచ్ఛత దివస్‌ను పాటించాలి

కర్నూలు కలెక్టరేట్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత దివస్ సందర్భంగా శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలోని ఉన్న కార్యాలయాలు పరి శుభ్రత పాటించాలని ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు అధికా రులను ఆదేశించారు. శుక్ర వారం డీఆర్వో కార్యాలయంలోని అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం రోజు స్వచ్ఛత దివస్‌గా పాటిం చాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ ఇచ్చే మార్గదర్శకాలను అనుసరించి జిల్లాలో అన్ని ప్రాం తాలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించినందున కలెక్టరేట్ ప్రాంగణంలోని అన్ని కార్యాలయాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలన్నా రు. సమావే శంలో పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసులు, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి రామాంజనేయులు, ఇన్‌చార్జి చీఫ్ ప్లానింగ్ అధికారి భారతి పాల్గొన్నారు.

వినియోగదారులు ఫిర్యాదు చేయొచ్చు

కర్నూలు కలెక్టరేట్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఎల్పీజీ రీఫిల్ డెలివరి సమయంలో ఎవరైనా గ్యాస్ డెలివరి బాయ్‌లు బిల్ ధర కన్నా అధిక చార్జీలు వసూలు చేస్తే గ్యాస్ వినియోగదా రులు పౌర సరఫరాల శాఖ అధికారులకు గానీ, లేదా టోల్‌ఫ్రీ నెంబరు 1967 లేదా, 18002333555కు ఫిర్యాదు చేయవచ్చని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రఘువీరా శుక్రవారం తెలిపారు. ఉచిత డెలివరి జోన్ అనగా 15 కిలోమీటర్ల లోపు ఉన్న ఎల్పీజీ వినియోగదారులు ఎటువంటి అదనపు చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. 15 కిలోమీటర్ల పరిధి దాటిన యెడల గ్యాస్ వినియో గదారులు రీఫిల్ డెలివరికి కేవ లం రూ.30 అదనంగా చెల్లించాలన్నారు.

బకాయిల వసూళ్లకు కసరత్తు

● **మార్చిలోగా రికవరీ చేసేందుకు ప్రత్యేక బృందాలు**

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో రైతులకు ఇచ్చిన దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణాలను మార్చి నెలాఖరులోపు వసూలు చేసేందుకు అధికా రులు చర్యలు చేపట్టారు. దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులు దాదాపు 4,080 మంది రూ.250 కోట్ల దాకా ఉన్నాయి. అదేవిధంగా డైరెక్టుగా బ్యాంకు నుంచే రైతులు రూ.30 కోట్ల దాకా దీర్ఘకాలిక రుణాలు తీసుకుని బకాయిలు చెల్లించడం లేదు. వీరికి లీగల్ నోటీసులు కూడా బ్యాంకు అధికారులు జా రీ చేశారు. ప్రస్తుతం ఈ బకాయిల వసూళ్లకు ఉమ్మడి జిల్లాలో నాలు గు ప్రత్యేక టీములను ఏర్పాటు చేస్తూ డీసీసీబీ సీఈవో విజయకుమార్ ఆదే శాలు జారీ చేశారు. ఆలూరు, ఆదోని, పత్తికొండ, సహకార బ్యాంకు బ్రాంచీ లకు ఏజీఎం త్రినాథ్ రెడ్డి, కోడుమూరు, డోన్, క్రిష్ణగిరి తదితర బ్రాంచీలకు డోన్ చీఫ్ మేనేజర్ జయ ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఆరుగురు అధికారులు ఉంటారు.

వడ్డెగేరిలో అగ్ని ప్రమాదం

కర్నూలు క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వడ్డెగేరిలో శుక్రవారం రాత్రి జయన్న అనే వ్యక్తి ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది. జయన్న ఆయన భార్య ఇంటి బయట కూర్చుని ఉండగా.. ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. దీంతో అగ్నిమాపక సిబ్బంది, వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేశారు. రూ.50వేల మేర నష్టం జరిగి ఉండవచ్చని బాధితులు తెలుపుతున్నారు. వాటర్ హీటరే ఈ అగ్నిప్రమాదానికి కారణ మై ఉండవచ్చని భావిస్తున్నారు.

అమిత హాస్పిటల్‌కు ఆరోగ్యశ్రీ గుర్తింపు



మాట్లాడుతున్న క్రిష్ణ మావి చాపే

కర్నూలు హాస్పిటల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ పేటలో ఉన్న అమిత హాస్పిటల్‌కు ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) గుర్తింపు లభిం చినట్లు ఆస్పత్రి అధినేత క్రిష్ణ మావి చాపే తెలిపారు. శుక్రవారం అమిత హాస్పిటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 13న హాస్పిటల్‌కు ఎన్టీఆర్ వైద్యసేవ గుర్తింపు ఇస్తూ ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో ఆదేశాలు జారీ చేశారన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద గైనిక్, పీడీ యాట్రిక్, సర్జరీ, ఆర్థో, యురాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, నెఫ్రాలజీ, ఈఎన్‌టీ వంటి విభాగాలకు వైద్యసేవలు అందుతాయని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే జనరల్ ఫిజీషియన్ ద్వారా ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు హాస్పిటల్‌లో ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

8వ రోజు 243 మంది ఎంపిక

కర్నూలు క్రైం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహధారుడ్య పరీక్షలు శుక్రవారం 8వ రోజు కొనసాగింది. శుక్రవారం 243 మంది ఎంపికయ్యారు. స్థానిక ఏపీఎస్పీ రెండో బెటాలి యన్‌లో నిర్వహించే ఈ పరీక్షలకు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ హాజరై పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 323 మంది అభ్యర్థులు బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికేట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరికి నిర్వహించిన ఫిజకల్ ఎఫీషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు పరీక్షలో 270 మంది అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగులో 152 మంది అర్హత సాధించారు. లాంగ్‌జంప్‌లో 240 మంది అర్హత సాధించారు. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు 8వ రోజు 243 మంది అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషినల్ ఎస్పీ అడ్మిన్ జి.హుశేన్ పీరా, ఏఆర్ అడిషినల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'అభివృద్ధికి సహకరిస్తాం'

కోడుమూరు రూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అమడగుంట్ల గ్రామాభివృద్ధికి సహకరిస్తామని టీడీపీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తెలిపారు. శుక్రవారం గ్రామంలో టీడీపీ నాయకుడి ఇంట కార్యక్రమానికి విచ్చేసిన వారికి స్థానిక నాయకులు పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న సీసీ రహదారులు, డ్రైనేజీ పనులను విష్ణువర్ధన్‌రెడ్డి పరిశీలించారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసిం దని తెలిపారు. తాగునీరు, వీధిలైట్లు, సీసీ రహదారులు, డ్రైనేజీల సమ స్యలను తెలపాలని నాయకులను కోరారు. అభివృద్ధి పనులకు సహకారం అందిస్తామన్నారు. అలాగే టీడీపీ సభ్యత్వ నమోదు వలన కలిగే ప్రయోజనాలు ప్రజలకు వివరించి సభ్యత్వం చేయించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మీ, నాయకులు తులసీరెడ్డి, శంకరరెడ్డి, రమేష్, శ్రీనివసరెడ్డి, సురేష్, మధునాయుడు, రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

శివస్వాములకు అన్నదానం

కర్నూలు(కల్చరల్), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): శివస్వాము లకు అన్నదానం ఏర్పాటు చేయడం మహాత్కార్యమని కర్నూలు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, ఆయన సతీమణి మాజీ కేడీసీసీ బ్యాంకు అధ్యక్షురాలు ఎస్వీ విజయమనోహరి అన్నారు. శుక్రవారం నగరంలోని నగరేశ్వర స్వామి ఆలయంలో శ్రీశైల శివదీక్ష పరుల సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్ర మాన్ని పూజలు చేసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో దేవ స్థానం పాలక మండలి సభ్యులు భక్తులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని సంఘంతో గందరగోళం

ఏపీ హెచ్‌ఏ ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): 38వ నేషనల్ గేమ్స్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సన్నహాలు జరుగుతున్నాయి. ఈ నేప థ్యంలో హ్యాండ్‌బాల్ ఫెడరేషన్‌కు గుర్తింపు గా ఉన్న ఆంధ్రప్రదేశ్ హ్యాం డ్‌బాల్ సంఘానికి సమాచారం లేకుండా గుర్తింపు లేని సంఘానికి చేతి వాటం ఇచ్చారని ఏపీ హెచ్‌ఏ ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు ఆరోపిం చారు. డిసెంబరు 20న ఒలింపిక్ సంఘం, స్పోర్ట్స్ అథారిటీ సమక్షంలో బీచ్ హ్యాండ్‌బాల్‌లో ఏపీ జట్లకు ఎంపిక చేయవచ్చన్న దానితో హడా వుడిగా చేసినట్లు ఆయన ఆరోపించారు. అయితే ఇండి యన్ ఒలింపిక్ అసోసియేషన్‌లో ఆయా రాష్ట్రాల్లో రెండు అసో సియేషన్లు ఏర్పడటంతో గందరగోళంగా ఏర్పడిందన్నారు. ఈ నెల 15న ఇండియన్ ఒలంపిక్ అసోసియేషన్, హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు (హెచ్ఎఫ్ఐ) అనుబంధంగా ఉందని ప్రకటించిందన్నారు. ఏపీలో మాత్రం ఫెడరేషన్ లిటి గేషన్ ఉందంటూ అధికారులు బుకాయించడం, ఒలింపిక్ అసోసియేషన్ ఇదే అదనుగా బావించి ఏపీ స్పోర్ట్స్ అథారిటీని తప్పుదోవ పట్టిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియన్ ఒలంపిక్ అసోసియేషన్ మార్గదర్శకాలను ఎప్పటికప్పుడు సరి చూసుకుని సరైన సంఘానికికి చెందిన క్రీడాకారులను నేషనల్ గేమ్స్‌కు పంపాలని కోరారు. హెచ్ ఎఫ్ఐకి అనుబంధంగా కర్నూలు కేంద్రంగా కొనసాగుతున్న ఏపీహెచ్ఏ లెటరు పంపినప్పటికీ స్పోర్ట్స్ అథారిటీ నిర్లక్ష్యం చేస్తుంద న్నారు. వాస్తవాలను పరిశీలించి ఏపీ బీచ్ హ్యాండ్‌బాల్ జట్టుకు నేషనల్ గేమ్స్ అనుమతించాలని కోరారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు హెచ్ఎఫ్ఐకి అనుబంధంగా ఉన్న సంఘాలు హ్యాండ్‌బాల్ టీమ్‌లను తీసుకెళ్తుంటే.. ఏపీలో హెచ్ ఎఫ్ఐకి అనుబంధం లేని సంఘానికి చెందిన క్రీడాకారుల ను ఏకపక్షంగా పంపడం దురదృష్టకరమన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ

కర్నూలు అర్బన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రను విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పీ.మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఆయ న మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్ర మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఈనెల 22న జిల్లాలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టబోయే పాదయాత్రలో కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉదయం 10:30 గంటలకు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం నుంచి నెహ్రూరోడ్డు, చౌక్‌బజార్, గడియారం హస్పిటల్, పెద్ద మార్కెట్ మీదుగా పాత బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని అక్కడ సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, షేక్ జిలానీ బాషా, సంబశివుడు, లాజరస్, దేవిశెట్టి ప్రకాష్, బజారన్న, వెంకట సుజా త, శ్రీలత, ప్రమీల పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్



మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బీసీ భవన్‌లో బీసీల భవిష్యత్తు ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై జాతీ య బీసీ సంక్షేమ సంఘం రౌండ్ టేబుల్ సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్య మం ఫలితంగానే ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు బీసీలకు రక్షణ చట్టం తెచ్చారన్నారు. అన్ని జిల్లాలో బీసీల భవన నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చార న్నారు. బీసీల అభివృద్ధికి పాటుప డుతున్న సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో జాతీ య బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, కేంద్ర స్థాయి నాయకుడు వేణుమాదవ్, బీసీ సంఘం నాయకులు ధనుం జయ ఆచారి, పోతురాజు రవికుమార్, చౌదరి, బాషా పాల్గొన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమ నేత జ్యోతిబసు: సీపీఎం



జ్యోతిబసు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు ఉద్యమ నేత, తుదిశ్వాస వదిలేవరకు ఓటమి ఎరుగని మహా యోధుడు జ్యోతి బసు అని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. న్యూసిటీ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కేకే భవన్‌లో జ్యోతిబసు 15వ వర్ధంతిని పురస్కరించుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో జిల్లా కార్యద ర్శివర్గసభ్యుడు ఎం.నారాయణ, నగర కార్యదర్శివర్గసభ్యుడు ఆర్.నరసింహులు, జిల్లా కమిటీ సభ్యుడు సి.గురు శేఖర్, నగేష్ పాల్గొన్నారు.

20న కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే



పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

కోడుమూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జాతీయ కుష్ఠు నిర్మూలనా దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 20 నుంచి కుష్ఠు వ్యాధి గ్రస్తుల గుర్తింపు సర్వే నిర్వహించనున్నట్లు వైద్యాధికారి మదనశేఖర్ అన్నారు. స్థానిక రెండో హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో శుక్రవారం సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని రాగి రంగుల మచ్చలు, కను రెప్పల వెంట్రుకలు రాలిపోవడం, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ లేక పోవడం వంటివి కుష్ఠు అనుమానిత లక్షణాలు అన్నారు. దీనిని ముందుగానే గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా ఇచ్చే మందులను వాడటం వలన వ్యాధిని నయం చేయవచ్చన్నారు. ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

నవరత్నాల రథోత్సవం



నవరత్నాల రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై విహరించారు. శుక్రవారం పుష్యమాసం చవితి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో రాఘవ్రేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి పూర్ణ బోధ పూజ మందిరంలో మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేసి హారతులు ఇచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల రథం పై వజ్రాలు పొదిగిన ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అధిష్టించి పీఠాధి పతి హారతులు ఇచ్చిన అనంతరం ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. ఉత్సవమూర్తికి ఊంజలసేవ నిర్వహించి హారతులిచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున తరలి వచ్చిన భక్తులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శేష వస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు.

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ సి. రజిత, వైద్యసిబ్బంది

కోసిగి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ కుష్టు వ్యాధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ సి.రజిత, సీహెచ్‌వో ఈశ్వరమ్మ అన్నారు. శుక్రవారం కోసిగిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు జాతీయ కుష్టు నివారణ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని రాగి రంగు గల మచ్చలు, చర్మం పొడిగా ఉండటం, కనుబొమ్మలు, కంటి వెంట్రుకలు రాలిపోవడం, కనురెప్పలు మూతపడకపోవడం, చర్మం ఉబెత్తుగా ఉండడం, చెవులపై బొడితెలు రావడం, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే కుష్టు వ్యాధి లక్షణాలుగా గుర్తించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు ఉచితంగా అందిస్తామన్నారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త, ఆశా వర్కర్ కుష్టు వ్యాధిపై ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసులు, ఎల్లప్ప, సూపర్‌వైజర్లు రాముడు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది ఉన్నారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

మంత్రాలయం జనవరి 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో శనివారం జరిగే 29వ ఎన్టీఆర్ వర్ధంతికి పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని టీడీపీ నియోజకరవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. మంత్రాలయం ఆర్యవైశ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తామన్నారు. అదే విధంగా మండలాల నాయకులు, కార్యకర్తలు తమ మండలాల్లోనే సేవా కార్యక్రమాలు జరపాలని మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్‌స్వామి, నరసింహులు కోరారు.

రెండో పెళ్లి చేసుకున్నాడని ఫిర్యాదు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని కడివెళ్ల గ్రామానికి చెందిన సుకన్య తన భర్త రాజు రెండో పెళ్లి చేసుకున్నాడని ఎమ్మిగనూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమకు ఆరేళ్ల కింద పెళ్లయిందని, ముంబైలో నివశిస్తున్నామని, తనను క్రిస్మస్ పండుగకు కడివెళ్ల గ్రామానికి పంపి మరో యువతిని పెళ్లి చేసుకున్నాడని ఫిర్యాదు చేసింది. తనకు ముగ్గురు ఆడపిల్లలు పుట్టారనే కారణంతో రెండో పెళ్లి చేసుకున్నాడని తెలిపింది. భర్తపై కేసు నమోదు చేయాలని ఆమె ఫిర్యాదు చేసిందని ఎమ్మిగనూరు ఎస్ఐ కె.శ్రీనివాసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గోనెగండ్ల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లకు చెందిన బోయ రమేష్(33) కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. గోనెగండ్లకు చెందిన రమేష్‌కు భార్య సుజాత, కుమారుడు, కూతురు ఉన్నారు. రమేష్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 13వ తేది రాత్రి బీసీ కాలనీలోని తమ బంధువులు ఇంట్లో భోజనం చేసి ఇంటికి నడుచుకుంటూ వెళ్లాడు. హెచ్ కైరవాడి గ్రామానికి చెందిన ఉప్పరి ఆశోక్, గోనెగండ్లకు చెందిన గోపాల్ అతిగా మద్యం సేవించి బైక్‌పై వేగంగా వెళుతూ రమేష్‌ను ఢీకొట్టారు. రమేష్ రోడ్డుపై ఎగిరి పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను స్థానికులు గోనెగండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవల కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

పంట రుణాలు అందించాలి



ఎస్‌బీఐ మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

కోసిగి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కౌలుకార్డు కలిగిన కౌలు రైతులందరికీ ఎలాంటి నిబంధనలు లేకుండా బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలని మంత్రాలయం రైతు సంఘం అధ్యక్షుడు ఎం.గోపాల్ కోరారు. శుక్రవారం కోసిగిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మబ్బు ఆంజనేయులు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, గ్రామాల్లో చాలా మంది కౌలు రైతులు వలసలు వెళ్తున్నారనీ, కౌలు కార్డు కలిగిన ప్రతి కౌలు రైతుకు పంట రుణాలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ కొల్లి కార్తీక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌతాళం సీపీఐ మండల కార్యదర్శి ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.





బండలాగుతున్న వృషభాలు, పోటీలను తిలకిస్తున్న మహిళలు

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ఎమ్మిగనూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా మాజీ మంత్రి దివంగత బీవీ మోహన్‌రెడ్డి జ్ఞాపకార్థం రైతు సంబరాల పేరుతో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు శుక్రవారం హోరాహోరీగా ఉత్కంఠ భరితంగా సాగాయి. పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి ఆరుపళ్ల పాలసైజు విభాగంలో 15జతల ఎద్దులు పోటీలో పాల్గొన్నాయి. తెలంగాణలోని నాగర్‌కర్నూలు, ఏపీలోని నంద్యాల, కర్నూలు జిల్లాల నుంచి ఎద్దుల జతలు పోటీల్లో పాల్గొని తమ సత్తాను చాటాయి. ఇందులో తెలంగాణ రాష్ట్రంలోని నాగర్‌కర్నూలు జిల్లా లింగాల మండలం కామవరం గ్రామానికి చెందిన అక్కిరరెడ్డి వృషభాలు నిర్ణీత సమయంలో 4,785.8 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.40వేలను కైవసం చేసుకున్నాయి. అలాగే నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గంలోని పిన్నాపురం గ్రామానికి చెందిన



బండలాగుతున్న వృషభాలు

బిజ్జెమ్మ, వెంకటకృష్ణమ్మల వృషభాలు 4,553.8 అడుగుల దూరాన్ని లాగి ద్వితీయ బహుమతి రూ.30వేలను గెలుచుకోగా, కర్నూలు జిల్లా బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన చిన్నరత్నం వృషభాలు 4,500 దూరాన్ని లాగి మూడవ స్థానంలో నిలిచి రూ.20వేలు కైవసం చేసుకున్నాయి. అలాగే పత్తికొండ నియోజకవర్గంలోని పందికోన గ్రామానికి చెందిన లవకుమార్ గోవిందయాదవ్, గోనెగండ్ల మండలం పెద్దనెలటూరు గ్రామానికి చెందిన ఇ.శ్రీనివాసులగౌడు వృషభాలు, ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె గ్రామానికి చెందిన లక్ష్మీనరసింహ వృషభాలు నిర్ణీత సమయంలో 4,200 అడుగుల దూరాన్ని సమానంగా లాగడంతో 4,5,6 బహుమతులను గెలుచుకున్నాయి. గెలుపొందిన వృషభారాజుల యజమానులకు కమిషనర్ గంగిరెడ్డి, పట్టణ సీఐ శ్రీనివాసులు, రూరల్ సీఐ బీవీ మధుసూదన్‌రావు బహుమతులు అందజేశారు. ఈ పోటీలను తిలకించేందుకు రైతులు అధిక సంఖ్యలో తరలిరావడంతో వైడబ్ల్యూసీఎస్ మైదానం కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో నిర్వాహకులు పార్లపల్లి చంద్రశేఖర్, భాస్కర్, విరుపాక్షిరెడ్డి, రాళ్లదొడ్డి మురళీకృష్ణారెడ్డి, రైస్‌మిల్ నారాయణరెడ్డి, కాశింవలి, పంచముఖి మహేంద్ర, రాందాసుగౌడు, జగదీష్, వెంకటరామిరెడ్డి, కోటేశ్వర శ్రీనివాసులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

ముగిసిన నీలకంఠుడి ఉత్సవాలు

ఎమ్మిగనూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ప్రజల ఆరాధ్యదైవం నీలకంఠేశ్వర స్వామి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. పుష్పరథారోహ మహోత్సవంతో ప్రారంభమైన ఉత్సవాలు ఐదు రోజుల పాటు కల్యాణోత్సవం, ప్రభోత్సవం, మహా రథోత్సవం, వాహ్యావళి, వసంతోత్సవం, తీర్థావళి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు శుక్రవారం ఉత్సవమూర్తిని చెక్కరథంపై అధిష్టించి ఆలయం నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలతో పురవీధుల గుండా ఊరేగింపుతో స్థానిక మార్కెట్ రోడ్డులోని బావి వద్దకు చేరుకుని గంగమ్మతల్లిపూజాతో పాటు ప్రత్యేకపూజలు, తీర్థావళి నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి పూజలు నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలికారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎద్దులింటి మాచాని నీల మురళీధర్, మాచాని శివశంకర్, పురోహితులు, భక్తులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన డ్రాగన్ రైడ్



నీలకంఠేశ్వరుడి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు, పట్టణ ప్రముఖులు





ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

అలరిస్తున్న క్రీడా పోటీలు

ఎమ్మిగనూరుటౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలోని ఆయా క్రీడా పోటీలు అలరిస్తున్నాయి. జాతర సందర్భంగా మాజీ మంత్రి దివంగత బీవీ మోహన్‌రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, బ్యాట్‌మెంటెన్ తదితర పోటీలు రెండు రోజులుగా ఎంతో ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. ఫుట్‌బాల్‌లో శుక్రవారం హుబ్లీ బాపూజి, ఫిరంగిపురం తలపడగా హుబ్లీబాపూజి 2.0 తేడాతో విజయం సాధించింది. ఎమ్మిగనూరు-ఎ హిందూపుర్‌పై 2.1తేడాతో విజయం సాధించింది. హుబ్లీ ఆజాద్, ఎమ్మిగనూరు-బి లు తలపడగా హుబ్లీ ఆజాద్ 3.0తేడాతో విజయం సాధించింది. మైసారం స్టార్స్ హైదరాబాద్ జట్టుపై హుబ్లీ పర్‌పుల్ పెనాల్టీ షూట్ ఔట్‌లో 4.1 తేడాతో హుబ్లీ పర్‌పుల్ విజయం సాధించింది. ఇలా దాదాపు ఎనిమిది జట్ల మధ్య పోటీలు హోరాహోరీగా సాగాయి. ఇందులో గెలుపొందిన వారు ప్రీక్వాటర్ ఫైనల్‌కు చేరుకున్నారు. శుక్రవారం ఫుట్‌బాల్ పోటీలను పెద్దమర్రివీడు మల్లయ్య, మాచాని శివకుమార్‌లు పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రామకృష్ణ నాయుడు, కామార్తి మహేష్ ఈరన్న, నరసింహులు, సోగనూరు జగదీష్, కె.టి వెంకటేశ్వర్లు, రంగన్న, రాఘవేంద్రలు పాల్గొన్నారు.



ఎద్దుల అలంకరణ సామగ్రి కొనుగోలు చేస్తున్న రైతులు

కొనుగోళ్లతో కళకళలాడిన జాతర



గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోమేశ్వర సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ జాతరకు వచ్చిన సందర్శకులను కనువిందు చేస్తోంది. ఎగ్జిబిషన్‌లోకి వెళ్తే అదో కొత్త ప్రపంచంలోకి వెళ్లినట్లు అనిపించేలా రంగు రంగుల కాంతులతో ఆహ్వానం పలుకుతూ చిన్నా,పెద్ద తేడా లేకుండా అందరూ ఇష్టంగా ఆడే జాయింట్ వీల్, డ్రాగన్ రైడర్, మ్యూజికల్ చైర్, బోటింగ్ రైడ్, ట్రైన్ లాంటివి పిల్లలు, పెద్దలు సరదాగా ఆడుతూ గడుపుతున్నారు. ఎగ్జిబిషన్ బయట చెరకు రసం. ఫాగ్ ఐస్, జ్యూస్‌లు రుచి చూస్తూ సేద తీరుతున్నారు. జాతరలో పిల్లలు ఆడుకునే ఆట బొమ్మలను కొంటూ పిల్లలతో కలసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సరదాగా సందడి చేస్తున్నారు.

పేరుకే సీజనల్ హాస్టళ్లు

- కనిపించని విద్యార్థులు
- కన్నెత్తి చూడని విద్యాధికారులు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

కౌతాళం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతి ఏటా కూలీలు పట్టణాలకు వలసలు పోతే వారి వెంట బడీడు పిల్లలను కూడా తీసుకుపోవడంతో అలాంటి విద్యార్థులు విద్యకు దూరమై బాలకార్మికులుగా మారుతున్న నేపథ్యంలో ప్రతి మండలంలో సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేసింది. ఇందుకు అన్ని సౌకర్యాలను కల్పించేలా భారీగా నిధులను కేటాయిస్తోంది. అయితే కొందరు ఈ అవకాశాన్ని ఆసరాగా తీసుకుని స్వచ్ఛంద సంస్థ పేరుతో సీజనల్ హాస్టళ్లను ప్రారంభించి నిధులను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలో వలస కూలీల పిల్లలకు అన్ని సౌకర్యాలను కల్పిస్తూ మూడు సీజనల్ హాస్టళ్లను గతేడాది డిసెంబరులో (కౌతాళం, ఎరిగేరి, కాత్రికి గ్రామాల్లో) ప్రారంభించింది. అప్పట్లో ఈ సీజనల్ హాస్టళ్ల ప్రారంభమైనట్లు మండల విద్యాధికారులకు కూడా తెలియదు. తమకు ఎలాంటి సమాచారం లేదని నిర్వాహకులే నేరుగా కలెక్టర్ ద్వారా అనుమతులు తీసుకుని హాస్టళ్లను ప్రారంభించారని తెలిపారు. ఈ హాస్టళ్లల్లో వలస కూలీల పిల్లల కంటే గ్రామంలో ఉండే పాఠశాలల్లోనే పిల్లల పేర్లతో సీజనల్ హాస్టళ్లను నిర్వాహకులు నిర్వహిస్తూ ప్రభుత్వ నిధులను దోచుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మూడు చోట్ల ఎక్కడ హాస్టళ్ల బోర్డులు లేకుండా పాఠశాలల్లోనే నిర్వహిస్తున్నారు. అయితే మండలంలోని ఓ సీఆర్‌పీనే సీజనల్ హాస్టళ్ల నిర్వహణలో చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. కౌతాళంలో మండల విద్యాధికారి కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న కన్నడ ఉన్నత పాఠశాలలో సీజనల్ హాస్టల్ నిర్వహిస్తున్నారు. ఇందులో స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఎవరు ఉండరు.. పేరుకు



కౌతాళంలో తాళం వేసిన సీజనల్ హాస్టల్

స్వచ్ఛంద సంస్థ నిర్వహణ మాత్రం ఆ సీఆర్‌పీ ఆధీనంలోనే ఉంటుంది. బోగస్ హాజరు సృష్టించి కేర్‌టేకర్ పేరిట తన ఇంటి సభ్యుల పేరుతోను, విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు మరో ఇంటి సభ్యున్ని నియమించి నెల నెల జీతాలు తీసుకుంటున్నట్లు సమాచారం. రాత్రి భోజనాలు చేసినట్లు కేవలం 10నుంచి 15 మంది గ్రామ విద్యార్థులను పిలిపించుకొని సాయంత్రం 6గంటలకే అల్పాహారం ఇచ్చి హాజరు మాత్రం 45నుంచి 50 మంది ఉన్నట్లు తప్పుడు రికార్డులను సృష్టిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా మండల విద్యాధికారులు తమకు ఏమి పట్టనట్లు ఉండటం అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఇలా చేస్తుండటంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అధ్వానంగా రోడ్డు

ఇబ్బంది పడుతున్న వాహనదారులు



ముళ్ల కంప చెట్లతో మూసుకుపోయిన రహదారి

గోనెగండ్ల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనేటూరు, బురాన్‌దొడ్డి గ్రామాల మధ్య ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. ముళ్ల కంపలు, గుంత మయంగా మారడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా రోడ్డు మరమ్మతులు చేయించే నాథుడే కనిపించడం లేదు. ఈ రెండు గ్రామాల మధ్య నాలుగు కిలోమీటర్ల దూరం ఉంది. ఇదే రోడ్డు వెంట ఇరు గ్రామాల రైతులు పొలాలకు వెళ్లాల్సి వస్తుంది. వర్షాకాలంలో రైతులు చాలా ఇబ్బందిగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో కాలి నడకన కూడా రాక పోకలకు ఇబ్బం దిగా ఉందని ఇరు గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు.

మహిళ ఆత్మహత్య

గోనెగండ్ల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన గోనెగండ్ల మండల కేంద్రంలోని వడ్డేవీధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. వడ్డే దరగమ్మ(25)అనే మహిళను ఐదేళ్ల క్రితం హెచ్ కైరవాడికి చెందిన వడ్డే వీరేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి రెండేళ్ల కూతురు ఉన్నది. అయితే దరగమ్మ కొన్ని మాసాలుగా కడుపునొప్పితో బాధపడుతుండేది. సంక్రాంతి పండగకు పుట్టినింటికి వచ్చింది. శుక్రవారం దరగమ్మ తల్లి నాగమ్మ కూలీ పనికి వెళ్లింది. అదే సమయంలో ఆమెకు కడుపునొప్పి రావడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఈ విషయంపై సీఐ గంగాధర్ మాట్లాడుతూ మృతురాలి బంధువులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని తెలిపారు. కేసు పూర్వాపరాలు తెలియరావాల్సి ఉంది.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఇంటి పట్టాల పంపిణీపై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మూడు నెలలు సీపీఐ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలోని ఇంటి స్థలాలు లేని పేదలకు రెండు సెంట్లు ఇవ్వాలని ఆందోళనలు చేశామన్నారు. ఇందుకు స్పందించిన కూటమి ప్రభుత్వం క్యాబినెట్ మీటింగ్‌లో ఆమోదం తెలపడం హర్షించదగ్గ విషయమన్నారు. పేద ప్రజల అభ్యున్నతికి సీపీఐ నిరంతర పోరాటాలు చేస్తుందన్నారు.

మఠానికి విరాళం

మంత్రాలయం, జనవరి17(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన అనసూయ అనే భక్తురాలు రూ.లక్ష దైనందిక సేవకు, అన్నదానానికి రూ.5లక్షలు విరాళం ఇచ్చినట్లు ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. శుక్రవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ. ఆరు లక్షలు చెక్కును విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబానికి శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల,పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో అనంతపురాణిక్, గిరిధర్, శ్రీపాదాచార్‌లు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు: సీఐ



రాఘవేంద్ర సర్కిల్‌లో వాహనాలకు జరిమానా వేస్తున్న సీఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్

మంత్రాలయం జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై కేసులు నమోదు చేస్తామని, కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రామాంజులు హెచ్చరించారు. శుక్రవారం రాత్రి ఎస్ఐ పరమేష్ నాయక్ ఆధ్వర్యంలో రాఘవేంద్ర సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ఉన్న ప్రధాన రహదారిలో రోడ్డుకు అడ్డంగా ఉంచిన వాహనాలు, బోర్డులు, వస్తువులను తొలగించారు. దుకాణాల యజమానులకు ద్విచక్ర వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఎటువంటి వ్యక్తులైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, భక్తులకు ట్రాఫిక్‌ను సరళతరంగా చేస్తామని తెలిపారు. కొంత మంది దుకాణాదారులు ఆర్‌అండ్‌బీ స్థలాలను సైతం ఆక్రమించి కుర్చీలు వేసి టీహోటళ్లు, టిఫిన్స్, గోబి, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు తదితర వాటిని యథేచ్ఛగా విక్రయిస్తుండటం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. రోడ్డుపై వాహనాలు ఆపినా, ఎటువంటి బోర్డులు, వస్తువులు ఉంచినా ఉపేక్షించేది లేదన్నారు. ఇందు కోసం లాడ్జీ, హోటళ్లు, ఆటోలు, ట్యాక్సీలు, దుకాణాల యజమానులు మంత్రాలయం ప్రజలు, భక్తులు పోలీసులకు సహకరించి ట్రాఫిక్‌కు సహకరించాలన్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ రమణ, పరమేష్, సోమశేఖర్, జమీర్, వీరేష్ పాల్గొన్నారు.

శివదీక్ష మాల స్వీకరణ

గోనెగండ్ల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలో శుక్రవారం మండల శివదీక్ష (40రోజుల) కార్యక్రమం ఈశ్వరదేవాలయంలో శివభక్తులు స్వీకరించారు. దీక్షధారణ కార్యక్రమం వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్య స్వామి ఆధ్వర్యంలో సాగింది. శివయ్య స్వాములు దీక్షా కాలంలో ఎలాంటి నియమాలు పాటించాలో భక్తులకు వివరించారు. భక్తుల శివనామస్మరణతో పరిసరాలు మారుమోగాయి.